www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 03 | మార్చి | 2026
పేజీలు : 8

గంజాయి మత్తులో యువత వీరంగం

నడిరోడ్డుపై ఒకరిపై ఒకరు దాడులు

ప్రజాపక్షం/ ఖమ్మం : గంజాయి మత్తులో యువకులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. వైరా, మధిర ప్రధాన రహదారిపై ఈ ఘటన చోటు చేసుకోవడంతో వాహనాలపై వెళ్తున్న వారు భయభ్రాంతులకు గురయ్యారు. సోమవారం వైరా రోడ్డులోని కియా షోరూం సమీపంలో ప్రధాన రహదారిపై ఐదారుగురు యువకులు గంజాయి మత్తులో కర్రలతో దాడులు చేసుకున్నారు. ఓ యువకుడు రక్తపు మడుగులో నడిరోడ్డుపై పడిపోయాడు. సమీపంలోని వాహనాలపై దాడి చేస్తారని వణికిపోయారు. మొత్తంగా గంజాయి మత్తులో యువకులు చేసిన హల్‌చల్ దాదాపు గంటపాటు భయోత్పాతం సృష్టించింది.

చర్యలతో విద్యా వ్యవస్థ గాడిన పడేనా..?



-ఉపాధ్యాయుల్లో కొరవడిన అంకితభావం
-బోధనేతర విషయాలపై దృష్టి

ఉపాధ్యాయుల్లో కొరవడిన అంకితభావం ప్రభుత్వ విద్యపై ప్రభావం చూపుతుంది. పాఠశాల సమయాల్లో బోధనేతర విషయాలపై దృష్టిసారిస్తున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సిబ్బంది, మౌలిక వసతులు ఉన్నా తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లలను పంపేందుకు సుముఖత వ్యక్తం చేయడం లేదు. బడిబాట లాంటి కార్యక్రమాలు సత్ఫలితాలను ఇవ్వడం లేదు. అర్హత లేని వారు విద్యాబోధన చేస్తున్నా ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో చేరుతుంటే ప్రభుత్వ పాఠశాలలు వెలవెలబోతున్నాయి. ప్రభుత్వ విద్యను గాడిన పెట్టేందుకు విద్యాశాఖాధికారులు నిబంధనలు పాటించని ఉపాధ్యాయులపై చర్యలకు ఉపక్రమించారు. ఈ చర్యలతోనైనా ప్రభుత్వ విద్య గాడిన పడుతుందా వేచి చూడాలి.

2 లో

-ప్రజాపక్షం/ఖమ్మం

కమిషనర్ ఆదేశాలు బేఖాతర్

-సిండికేట్ వెనక ఉన్న మున్సిపల్ ఉద్యోగి ఎవరు...?
-కార్పోరేషన్‌లో పన్ను చెల్లించని వ్యాపార సంస్థలు
-ప్రభుత్వ సొమ్ము ప్రైవేటు ఖాతాలకు

ప్రజాపక్షం/ఖమ్మం : ఖమ్మం కార్పోరేషన్‌లో ఉద్యోగుల తీరు తలను తోక ఆడించినట్లు ఉంది. కమిషనర్ ఆదేశాలను సైతం లెక్కచేసే పరిస్థితిలో ఉద్యోగులు లేరు. లిఖిత పూర్వక ఆదేశాలను సైతం పట్టించుకోడం లేదు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో చాలా వ్యాపార సంస్థల నుంచి వాణిజ్య పన్ను వసూళ్లు అధికారికంగా చేయకుండా మొత్తం వ్యవస్థను తప్పుదారి పట్టిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా వ్యాపారం నిర్వహించడంతో పాటు కార్పోరేషన్‌కు చెల్లించాల్సిన పన్నులు చెల్లించని కొన్ని వ్యాపార సంస్థలపై కార్పొరేటర్లు నేరుగా కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు అధికారుల వ్యవహార శైలిపైన పలు ఆరోపణలు చేశారు. ఆరేండ్లుగా కోట్ల రూపాయల లావాదేవీలు కలిగిన వ్యాపారుల నుంచి పన్ను వసూలు చేయకపోవడాన్ని ఆధారాలతో సహా కమిషనర్ దృష్టికి తీసుకు రావడంతో కమిషనర్ అభిషేక్ అగస్త్య వెంటనే స్పందించారు. ఇల్లందు రోడ్డులోని శ్రీ విజయ దుర్గా స్టీల్ సిండికేట్ దుకాణాన్ని మూసివేయాలని లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేశారు. క్షేత్రస్థాయి సిబ్బంది మాత్రం ఆదేశాలను బుట్ట దాఖలు చేశారు. కమిషనర్ ఆదేశాలు ఏమయ్యాయో కానీ

మిగతా 2లో..

కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన కూనంనేని

- ప్రజా సమస్యల పరిష్కారంలో సహకరించండి

2 లో

రంగుల సంబురంలో రసాయన ముసుగు..!

- కళ్లకు కనిపించని ప్రమాదాలు
- సహజ రంగులే ఆరోగ్యానికి రక్షణ
- నేడే హోలీ రంగుల ఖేళీ

ప్రజాపక్షం/ కొత్తగూడెం : ఆనందపు రంగుల సంబురంలో రసాయన ముసుగు ప్రజారోగ్యాన్ని శాశిస్తోంది. ప్రేమగా పూసుకునే రంగులు శాపంగా మారుతున్నాయి. నేడు జరిగే హోలీకి గ్రామాలు,పట్టణాలు సిద్ధమవుతున్న వేళ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. హోలీకి ఉపయోగించే రంగులు తక్కువ ధరలకు మార్కెట్లో విక్రయాలు సాగుతున్నాయి. అవి రసాయన పూరితమైనవిగా తెలుస్తోంది. సహజసిద్ధమైన రంగులను వాడితే ఎలాంటి ప్రమాదం ఉండదని నిపుణులు చెబుతున్నారు.

మిగతా 2లో..

చర్యలతో విద్యా వ్యవస్థ గాడిన పడేనా..?

ప్రజాపక్షం/ ఖమ్మం : గతేడాది గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న సమయం అది. పోలింగ్ కేంద్రాలను పరిశీలించే క్రమంలో మండల అధికారులు పాఠశాలకు విచ్చేశారు. మండల అధికారులు వెళ్లే సమయానికి అక్కడ ఉపాధ్యాయులు తరగతి గదిలో ఉండి విద్యార్థులను పట్టించుకోకుండా ఫోన్ మాట్లాడుతున్నారు. బరాబర్ రిజిస్ట్రేషన్ అవుతుంది, సూపర్ బిట్, రూపాయి వచ్చేది మీకు చూపిస్తా నాలుగు గంటలకు కలుద్దామని ఫోన్ మాట్లాడుతున్నారు. సొమ్యుడైన ఆ మండల అధికారి ఇదేం పని అంటూ మందలించి వదిలేశాడు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. చాలా మంది ఉపాధ్యాయులపై పాఠశాల సమయాల్లో బోధన మరిచి ఆదాయ విషయాలపై ఫోన్‌ల ద్వారా మాట్లాడుతున్నారు. రియల్ ఎస్టేట్ మొదలు అనేక ఆదాయ వనరులపైన దృష్టిసారిస్తున్నారు. మరికొందరు బిల్లు, బెల్లుకు పరిమితమవుతున్నారు. సమయానికి పాఠశాలకు వచ్చామా నెల వేతనం తీసుకున్నామా అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికీ కొందరు ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా నడుపుతున్నారు. సొంత డబ్బులతో మౌలిక వసతులు కల్పించడం, పోటీ పరీక్షలకు సిద్ధం చేయడం ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అన్ని రంగాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తయారు చేస్తున్నారు. వీరు అభినందనీయులు కానీ వీరి సంఖ్య ఏడాదికి ఏడాది తగ్గిపోతుంది. ఇప్పుడు ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో చాలా మంది సమయ పాలన పాటించకపోవడం, పాఠశాలకు వచ్చినా సరిగ్గా పనిచేయకపోవడం ఇతరత్రా వ్యవహారాలపై దృష్టి సారించడం చేస్తున్నారు. ఇటువంటి వారిపై విద్యాశాఖ దృష్టిసారించింది. సుమారు 50 మంది ఉపాధ్యాయులకు నోటి తాఖీదులు ఇచ్చింది. క్షిణ దశకు చేరుకుంటున్న ప్రభుత్వ విద్య బలోపేతానికి ఉపాధ్యాయుల్లో మార్పు తీసుకు రావడంతో పాటు తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలి. విద్యను వ్యాపారంగా మార్చిన ప్రైవేటు విద్యా సంస్థలపై ప్రభుత్వం కఠిన వైఖరిని అవలంభించాలి. ఫీజుల దోపిడీని అరికట్టాలి. మొత్తంగా సామాన్యులకు అత్యుత్తమ విద్యను బోధించాలి.

కమిషనర్ ఆదేశాలు బేఖాతర్



(మొదటిపేజీ తరువాయి)

శ్రీ విజయ దుర్గా స్టీల్ సిండికేట్ మాత్రం యథేచ్ఛగా నడుస్తుంది. శ్రీ విజయ దుర్గా స్టీల్ సిండికేట్‌కు సంబంధించి ఎటువంటి అనుమతులు లేవు. ఈ విషయాన్ని స్వయంగా కమిషనర్ కార్యాలయమే తెలిపింది. దుకాణం నిర్వహిస్తున్న ఇంటిని కార్పోరేషన్ గుర్తించ లేదని, ఆ ఇంటికి నెంబర్ కూడా లేదని ధృవీకరించారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఆరేండ్లుగా వ్యాపారం నిర్వహిస్తున్న కార్పోరేషన్ అధికారులు పట్టించుకోకపోవడం వెనక మతలబు ఏమిటన్నది అర్థం కావడం లేదు. ఈ వ్యవహారం ఒక్క శ్రీ విజయ దుర్గా స్టీల్ సిండికేట్‌కు మాత్రమే పరిమితమైందా, కార్పోరేషన్ పరిధిలో ఇటువంటి పన్ను వసూలు చేయని, అనుమతులు లేని వ్యాపార సంస్థలు ఎన్ని ఉన్నాయో అన్న ఆరోపణలు వినవస్తున్నాయి. పన్ను వసూలు చేయకపోవడంతో కార్పోరేషన్‌కు కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతుంది. పన్ను వసూళ్లు చేసే బాధ్యులు ఎవరు , ఎందుకు వసూళ్లు చేయడం లేదు. ఇల్లందు రోడ్డులోని శ్రీ విజయ దుర్గా స్టీల్ సిండికేట్ లాంటి సంస్థలు ఎన్ని ఉన్నాయి అనే దానిపై పాలక వర్గం పూర్తి విచారణ చేపడితే అనేక విషయాలు వెలుగు చూసే అవకాశం ఉంది.

అంగరంగ వైభవంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

ప్రజాపక్షం/కారేపల్లి: మండల కేంద్రమైన కారేపల్లిలో గల సంత గుడి ప్రాంగణంలో వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఎండోమెంట్ ఈవో వేణుగోపాలచార్యులు పర్యవేక్షణలో జూనియర్ అసిస్టెంట్ మూడు మోహన్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ కళ్యాణ క్రతువు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రతి సంవత్సరం నిర్వహించే కళ్యాణ మహోత్సవానికి ఉదయం నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి దర్శనం చేసుకున్నారు. వేద పండితులు వేద మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా కళ్యాణ కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారుఉ. పీటలపైన సురేందర్ మనీయార్, నల్లపాటి శ్రీనివాసరావు, పెండ్యాల లక్ష్మీనారాయణ, జగదీష్, పి నాగేశ్వరరావు దంపతులు కూర్చొని కళ్యాణం నిర్వహించారు.

కళకళలాడింది....

మహోత్సవంలో భాగంగా దేవస్థానం మాజీ చైర్మన్ అడ్డగోడ ఐలయ్య కుటుంబ సమేతంగా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఐలయ్య దంపుతులు ఉమారాణితో కలిసి, కుమారుడు శ్రీనివాస్‌తో ప్రత్యేక పూజలు నిర్వహించి, మూల విరాట్‌ను పట్టువస్త్రాలు అందజేశారు. స్వామి వారికి ప్రత్యేక ఆలంకరణలు చేసి పుష్పలతో కళ్యాణ మండప ప్రాంగణాన్ని అందంగా ముస్తాబు చేశారు. తాళాలు, డోలు వాయిద్యాల శుభనాదం మధ్య స్వామి వారి కళ్యాణం వైభవంగా కొనసాగింది. కళ్యాణ సమయంలో అర్చకులు స్వామి వారి దివ్య గుణాలను, కళ్యాణ మహిమలను వివరించారు. కళ్యాణానంతరం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఆలయ మండపం ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. సాయంకాలం స్వామివారి గ్రామోత్సవం ఊరేగింపు నిర్వహించారు. ఈకార్యక్రమంలో కారేపల్లి గ్రామ సర్పంచ్ వీర ప్రతాప్(టోనీ), సంత మాజీ చైర్మన్ అడ్డగోడ ఐలయ్య, మాజీ ఎంపీపీ కాంగ్రెస్ నాయకురాలు పగడాల మంజుల, స్థానిక ప్రజలు, వ్యాపారులు, యువకులు, మహిళలు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, ప్రముఖులు ఈ కళ్యాణ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని సేవలందించారు.

రంగుల సంబురంలో రసాయన ముసుగు..!

(మొదటిపేజీ తరువాయి)

రసాయన పూర్తి రంగులను కొనుగోలు చేసి హోలీ సంబురాలు జరుపుకోవడం శరీరంపై దురగ, ఎర్రబారిపోవడం వట్టి ఎదురయ్యే ప్రమాదం లేకపోలేదు. అనుకోని సందర్భాల్లో కళ్లలో పడితే తీవ్రమైన మంట, చూపు మందగించడంవంటి ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది.

కనిపించని ప్రమాదాలు..

రసాయన రంగుల్లో సీసం, పాదరసం వంటి లోహాలు ఉండే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇవి శరీరానికి దీర్ఘకాలిక హానీ కలిగించే ప్రమాదం ఉంది. చర్మవ్యాదులు ఉన్న వారికి సమస్య మరింత ఝుఠిలమయ్యే ప్రమాదం ఉంది. కళ్లలో రంగులు పడితే వెంటనే పరిశుభ్రమైన నీటితి కడుక్కోవాలి. సమస్య తీవ్రత కొనసాగినా పెరిగినా వెంటనే వైద్యనిపుణులను సంప్రదించడం మంచిది. హోలీలో రంగులు పూసుకున్న తర్వాత చాలా జాగ్రత్తలు తీసుకోవాలని, చర్మ సంరక్షణలో భాగంగా ముందస్తు చర్యలు తీసుకుంటే మంచిదని, లేదంటి చన్న సమస్య కాస్తా పెద్దదువుతుందని పలువురు సూచిస్తున్నారు.

సహజరంగులు ఎంతో మేలు :

పసుపు, కంకుమ, గులాబీ రేకులు, బీట్‌రూట్, మోదుకుచెట్టు పూలతో తయారు చేసినరంగులు చర్మానికి ఎలాంటి హానీ తలపెట్టవని చర్మ వైద్య నిపుణులు చెబుతున్నారు. హోలీ ఆడే ముందు శరీరానికి కొబ్బరి నూనెను రాయడం మంచిది. కళ్లకు రక్షణగా కళ్లజోళ్లు ధరించడం మంచిది. చిన్నపిల్లలు తక్కువ మోతాదులో రంగులు ఉపయోగించాలి. ఆరోగ్యానికి కాపాడుకుంటూ సంబురంలో మునిగితేలాలని లేదంటే రంగుల సంబురంలో రసాయనాల మాటున అనారోగ్యాన్ని కొనితెచ్చుకున్నట్లు అవుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన కూనంనేని

ప్రజాపక్షం/ కొత్తగూడెం : జిల్లా కలెక్టర్‌గా నూతనంగా విధుల్లోకి చేరిన అంకిత్‌ను ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్‌లతో కలిసి ఆయన కలెక్టర్‌కు పుష్పగుచ్చం అందించి శుభా కాంక్షలు తెలిపారు. ఈ భేటీలో ప్రధానంగా కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని ప్రస్తుత పరిస్థితులు, ప్రజల ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలపై చర్చించారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, మౌళిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవచూపాలని ఎంఎల్‌ఏ కలెక్టర్‌ను కోరారు. జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధుల సమన్వయంతో కొత్తగూడెం అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని వారు ఆకాంక్షించారు. పాలనలో, సమస్యల పరిష్కారం మరింత వేగం పెరుగుతుందని కూనంనేని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గ భౌగోళిక పరిస్థితులు, ప్రారిశ్రామిక ప్రాముఖ్యతను కలెక్టర్‌కు వివరించిన ఎంఎల్‌ఏ ప్రజా సమస్యలపై ఎళ్ల వేళలా స్పందించాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, జిల్లా సర్వతోముఖాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

స్వచ్ఛమైన తాగునీటిని అందించండి

ప్రజాపక్షం/ ఖమ్మం : స్వచ్ఛమైన త్రాగునీటిని నగర ప్రజలకు అందించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో మంచినీటి పథకాల నిర్వహణపై దృష్టి సారించాలని ఆయన అధికారులను కోరారు. వేసవి అంటే నీటి ఎద్దడి ఏర్పడుతుందని ఇందుకు సంబంధించి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించడానికి ప్రణాళికాబద్ధ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ప్రకటనను విడుదల చేసిన వారిలో జ్వాలా నర్సింహారావు, ఎండి రెహ్మాన్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలి

-మాస్‌లైన్ నేత గుమ్మడి నర్సయ్య

ప్రజాపక్షం/ ఖమ్మం : వెలుగుమట్ల బాధితులకు సత్వరం న్యాయం చేయాలని మాజీ శాసన సభ్యులు, సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు గుమ్మడి నర్సయ్య డిమాండ్ చేశారు. సోమవారం బాధితులను గుమ్మడి నర్సయ్య, మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు జి. సత్యనారాయణరెడ్డి స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతరం సమస్యను కలెక్టర్‌తో చర్చించారు. ఈ సందర్భంగా గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ భూదాన్ భూమిలో నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న వారిని రోడ్డుపైకి నెట్టి నివాసాలను ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇండ్లు కోల్పోయి రోడ్డున పడ్డ పేదలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పేదలు కష్టపడి నిర్మించుకున్న ఇండ్లను కూల్చివేయడం అమానుష చర్య అని గుమ్మడి తెలిపారు. భూదాన్ భూములు పేదలకు చెందుతాయి తప్ప రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కాదని ఆయన తెలిపారు. మంత్రి పొంగులేటి మాట నిలపుకోవాలని ఈనెల 15 నాటికి నివాస స్థలాలు పంపిణీ చేయడంతో పాటు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాస్‌లైన్ నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, సివై పుల్లయ్య, జి. రామయ్య, ఆవుల అశోక్, శిరోమణి, ఝాన్సీ, శోభ, మంగతాయి, శ్రీనివాస్, మలీదు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కళాకారుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాపక్షం/పాల్వంచ : తెలంగాణ కళాకారుల సమస్యలను పరిష్కరించి వారికి గుర్తింపు, హెల్త్ కార్డులు, ఉద్యోగాలు ఇవ్వాలని తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కొండలరావు డిమాండ్ చేశారు. సంఘం పిలుపులో భాగంగా జిల్లా కలెక్టర్ అంకిత్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సోమవారం అందజేశారు. ఈసంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంస్కృతి, జీవనశైలి దేశ సాంస్కృతిక రంగాన్ని తెలియ జేస్తుందన్నారు. అనంతరం తెలంగాణ ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు అధ్యక్షతన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శనగారపు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కమటం కొమరయ్య, భాషా, జిల్లా నాయకులు కే. క్రిష్ణ, డి. లక్ష్మి, రాజేశ్వరి, కే. రామారావు, పి. సంజీవరావు, అల్లి వెంకటేశ్వర్లు, హెచ్. వెంకన్న, ఈ. రామారావు, భూక్యా బిక్కూలాల్, కోట సుందర్‌రావు, తాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన ఎర్రుపాలెం జట్టు

ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : జనవరి 29వ తేదీ నుండి ప్రారంభించిన రెండు తెలుగు రాష్ట్రాల మెగా క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్‌లో ఎర్రుపాలెం జట్టు విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్‌లో ఎర్రుపాలెం, బుచ్చిరెడ్డిపాలెం జట్టులు తలపడగా ఎర్రుపాలెం జట్టు విజయం సాధించింది. ఈ టోర్నమెంట్‌లో మొదటి బహుమతి రూ.35,116 ఎర్రుపాలెం జట్టు, రెండవ బహుమతి రూ.30,116 బుచ్చిరెడ్డిపాలెం జట్టు, మూడవ బహుమతి రూ.25,116 ఎస్ఆర్‌పురం తండా, నాల్గొవ బహుమతి రూ.15,116, అమరావతి టీమ్, ఐదవ బహుమతి రూ.10,116 మధిర బ్లూ స్టార్ టీమ్ గెలుచుకోవడం జరిగిందిన నిర్వాహకులు తెలిపారు. విజేతలకు బహుమతులను దాతలు తుల్లూరి నిర్మలాకుమారి, వేమిరెడ్డి శ్రీనివాసస్‌రెడ్డి, డాక్టర్ కోట రాంబాబు, మారపాక బాబురావు, రామకృష్ణ చేతులమీదుగా పంపిణీ చేయటం జరిగింది. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ యరమల శ్రీనివాస్‌రెడ్డి, రామారావు, శేషురెడ్డి, కొండారెడ్డి, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

-ప్రజావాణిలో అర్జీలను స్వీకరించిన కలెక్టర్

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కొణిజర్ల మండలం దిద్దుపూడి గ్రామానికి చెందిన అమర్లపూడి భాస్కర్ రావు సర్వే నెం. 82, 83 లలో తమ భూమి ఉందని సర్వే నెంబర్ 81లో ఉన్న తమ భూమిని సబ్ స్టేషన్‌కు కేటాయించగా హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండడంతో ఆ స్థలం నుంచి మార్చడం జరిగిందని ప్రస్తుతం మున్సిపాలిటీ వారు అట్టి స్థలంలో ఎటువంటి సర్వేలు చేపట్ట కూడదని హైకోర్టు తీర్పు ఉన్నప్పటికీ డంపింగ్‌కు యార్డుకు కేటాయించారని దీనికి సంబంధించి తగు చర్యలు తీసుకుని తమ పేరు పట్టా పాసుపుస్తకాలు జారీ చేయాలని దరఖాస్తు చేశారు. నేలకొండపల్లి మండలం ముతాపురం గ్రామం పెద్దతండాకు చెందిన గిరిజనులు గత ప్రభుత్వం సర్వే నెం. 663 నందు తమకు ఆరు ఎకరాల స్థలం కేటాయించిందని అందులో నుంచి బంజరా భవన్, సేవాలాల్ మందిరం కొరకు స్థలం కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. చింతకాని మండలం పండిళ్లపల్లి గ్రామానికి చెందిన లక్ష్మి ప్రియ అనంతసాగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 181లో వ్యవసాయ భూమి ఉందని సర్వే నెం. 182లో ఉన్న మరో ఎకరం భూమి కూడా తాము వారసత్వంగా సాగు చేసుకుంటున్నామని తమ పట్టా పాసుపుస్తకంలో ఆ భూమి వివరాలు కూడా నమోదు చేసి పాసుపుస్తకం ఇవ్వాలని దరఖాస్తు చేశారు. ఆయా దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ సత్వరమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డిసి ఎం. రాజేశ్వరి, జెడ్పిసిఈవో దీక్షారైనా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పిఎం సూర్య ఘర్‌ను ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి

-పిఎం సూర్యఘర్, 99 రోజుల కార్యాచరణపై కలెక్టర్ సమీక్ష

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : పిఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులతో పిఎం సూర్య ఘర్ పథకం, 99 రోజుల ప్రజాపాలన, ప్రగతి పాలన కార్యాచరణపై అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి సమీక్షించారు. పిఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంపై సంపూర్ణ వివరాలను టిజిఎన్‌పిడిసిఎల్ ఎస్ఈ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇంటి పైకప్పుపై సౌర ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసుకుంటే ఇంటి యజమానులకు సబ్సిడీ ఇస్తుందన్నారు. సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్ ఖర్చు తగ్గడంతో ప్రయోజనం కలుగుతుందని అవసరమైన వారు www.pmsuryaghar.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ, గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని ప్రోత్సహించడంలో ఈ పథకం ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. ఇంటిపై ఒక కిలో వాట్ సోలార్ ప్యానెల్ ఏర్పాటుకు రూ. 30వేలు, రెండు కిలో వాట్ ఏర్పాటుకు రూ. 60వేలు, మూడు కిలో వాట్ ఏర్పాటుకు రూ. 78వేల సబ్సిడీ వస్తుందని మిగిలిన నిధులు బ్యాంకు లోన్ ద్వారా సమకూర్చుకోవచ్చునని తెలిపారు. ప్రభుత్వం 99 రోజుల ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యాచరణ అత్యంత కట్టుదిట్టంగా చేపడుతుందని మార్చి ఆరు నుంచి జూన్ 12 వరకు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమల్లో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో మున్సిపల్, పంచాయతీ శాఖలతో పాటు అన్ని శాఖలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి అప్‌డేట్ వివరాలు ఎప్పటికప్పుడు గుగూల్ షీట్‌లో నమోదు చేయాలన్నారు.ఈ సందర్భంగా ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనకు సంబంధించి పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సమావేశంలో ఎస్‌డిసి ఎం. రాజేశ్వరి, జెడ్పిసిఈవో దీక్షారైనా, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారి, రెడ్కో జిల్లా మేనేజర్ అజయ్ కుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన వారికి ఘన వీడ్కోలు

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : దీర్ఘకాలం ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి ఘనంగా వీడ్కోలు పలికారు. కలెక్టరేట్‌లో 2026 ఫిబ్రవరిలో ఉద్యోగ విరమణ పొందిన నలుగురు ఉద్యోగుల వీడ్కోలు కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి హాజరై ఉద్యోగుల సేవలను కొనియాడారు. పశుసంవర్ధక శాఖలో వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్‌గా పనిచేసిన మల్లేశ్వరీ, పంచాయతీ రాజ్ శాఖకు చెందిన టైపిస్ట్ షేక్ జానిమియా, సోషల్ వెల్ఫేర్ శాఖలో వంట మనిషిగా పనిచేసిన అంజమ్మ, వైద్య ఆరోగ్య శాఖలో సబార్డినెట్‌గా పనిచేసిన గిరిజ లు ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 35 ఏళ్ల పాటు ప్రజాసేవలో నిర్విరామంగా సేవలు అందించి నేడు ఉద్యోగ విరమణ పొందుతున్న అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరం వారి జీవితం ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం పదవి విరమణ పొందిన ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డిసి ఎం. రాజేశ్వరి, జెడ్పిసిఈవో దీక్షారైనా, జిల్లా అధికారులు, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జేవిఆర్‌ఓసి ఉద్యోగులకు కెరీర్ గ్రోత్ స్కీం ద్వారా పదోన్నతులు

ప్రజాపక్షం/సత్తుపల్లి: జేవిఆర్‌ఓసిలో కెరీర్ గ్రోత్ స్కీం కింద మొత్తం 16 మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించబడినట్లు సింగరేణి అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెడ్ ఓవర్ మన్ గ్రేడ్ ఏ నుండి గ్రేడ్ఏ1కు ఐదుగురు, ఓవర్ మన్ గ్రేడ్‌బి నుండి హెడ్ ఓవర్ మన్ గ్రేడ్ఏకు ఏడుగురు పదోన్నతి పొందారు. అదే విధంగా టైం రేటెడ్ వేకెన్సీల ద్వారా ఐదుగురు ఉద్యోగులు ఉన్నత స్థాయికి చేరుకున్నారు. కిష్టారం ఓసీలో ఒకరికి వెల్డర్ కేటగిరీఫోర్త్ నుండి కేటగిరీఐదు వరకు, అలాగే జెఆర్‌జేవీఆర్‌సి హెచ్‌పీలో మెకానికల్ (ఫోర్‌మన్) గ్రేడ్‌బి నుండి గ్రేడ్ఏకు ఒకరికి పదోన్నతి కల్పించారు. జేవిఆర్ ఓసిలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సత్తుపల్లి ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ ప్రమోషన్ ఆర్డర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జేవిఆర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్వీఆర్ ప్రహ్లాద్ , జేవిఆర్ ఓసి, ప్రాజెక్ట్ ఇంజనీర్, డి శ్రీనివాసరావు , జెవిఆర్, ఎస్ఓఎం బి రాజేశ్వరరావు, ఓసి ఎంజి. కళ్యాణ్ రామ్, ఏఐటియూసి బ్రాంచ్ సెక్రటరీ సుధాకర్ , ఐఎన్‌టిసి, వైస్ ప్రెసిడెంట్ బి కోటేశ్వరరావు, ఏఐటియూసి పిట్ సెక్రటరీ నరసింహారావు, వెల్ఫేర్ ఆఫీసర్ కె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిమూలం శ్రీనివాసరావుకు కాంగ్రెస్ నివాళి

ప్రజాపక్షం/ మధిర : మధిర పట్టణంలో బంజారాకాలనీ నందు కాంగ్రెస్ పార్టీ నాయకులు దివంగత ఆదిమూలం శ్రీనివాసరావు ప్రథమ వర్ధంతి సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, పట్టణ అధ్యక్షులు మిర్యాల రమణగుప్తా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదిమూలం శ్రీనివాసరావు కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ గల నాయకుడని, సమాజ సేవకు ప్రాధాన్యతనిచ్చారని, ఆయన ఆశయాలను నెరవేర్చడానికి కాంగ్రెస్ పార్టీ కృషిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు యన్నం కోటేశ్వరరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్, మండల బిసిసెల్ అధ్యక్షులు చిలువేరు బుచ్చిరామయ్య, షేక్.జహంగీర్, కర్నాటి రామారావు, బోల్లెద్దు రాజేంద్ర, కోట నాగరాజు, మునుగోటి వెంకటేశ్వరరావు, సాలిక సురేష్, ముచ్చు లలిత, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లూరు గ్రామంలో ఎల్ఇడి లైట్లు ఏర్పాటు

ప్రజాపక్షం/ మధిర : మధిర మండలంలోని ఇల్లూరు గ్రామంలో ఎల్ఇడి వీధిలైట్ల ఏర్పాటు కార్యక్రమాన్ని సర్పంచ్ చేకూరి ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా గ్రామంలో అనేక వీధులు చీకటిలో మగ్గిపోతుండగా గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాభివృద్ధి పట్ల కట్టుబడి ఉన్న నూతన గ్రామ సర్పంచ్ చేకూరి ఆదిలక్ష్మి సమస్యను గుర్తించి వెంటనే చర్యలు తీసుకున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారులు, అంతర్గత వీధుల్లో కొత్త ఎల్ఇడి లైట్లు ఏర్పాటు చేయడంతో గ్రామం మొత్తం వెలుగులతో కళకళలాడుతోంది. ఎల్ఇడి లైట్ల ఏర్పాటు వల్ల రాత్రివేళల్లో భద్రత పెరగడంతో పాటు విద్యుత్ వినియోగం కూడా తగ్గుతుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన వారందరికీ సర్పంచ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో అంధకారం తొలగించి కొత్త వెలుగులు నింపిన సర్పంచ్ చేకూరి ఆదిలక్ష్మి సేవలను గ్రామస్తులు ప్రశంసిస్తున్నారు.

టిఎన్జీవో క్యాలెండర్ల ఆవిష్కరణ

ప్రజాపక్షం/ మధిర : ఖమ్మం జిల్లా టిఎన్జీవో డైరీ, క్యాలెండర్‌ను మధిర పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ కే.సాంబయ్య, జర్నలిహెచ్వైడి వినోద్‌కుమార్, మధిర టిఎన్జీవో అధ్యక్షులు గుర్రం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ టిఎన్జీవో అభివృద్ధి కార్యకలాపాలు దినదినాభివృద్ధి చెందాలని, ఉద్యోగులందరూ విధి నిర్వహణ బాధ్యత నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు గద్దల రజినికాంత్, లింగాల నాగేశ్వరరావు, పాలిటెక్నిక్ సూపరింటెండెంట్ ఆర్.భాస్కర్, ఎస్.సరస్వతీ, ఎండి అలీ, బి.రాజేష్, ఎ.హరికుమార్, వి.శ్రీనివాసచారి, బి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుద్దీల్ల శ్రీపాదరావు జయంతి

ప్రజాపక్షం/సత్తుపల్లి: మండల పరిధిలోని గంగారంలో గల 15వ బెటాలియన్ ప్రాంగణంలో మాజీ శాసనసభ స్పీకర్ దుద్దీల్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెటాలియన్ కమాండెంట్ ఎ. అంజయ్య హాజరై శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1984లో కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన శ్రీపాదరావు మూడుసార్లు ఎమ్మెల్యేగా ప్రజాసేవ చేసి, అనంతరం శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వర్తించి ఆ పదవికి విశిష్ట గౌరవాన్ని తీసుకువచ్చారని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సహాయ దళాధిపతులు ఎస్. శ్రీధర్ రాజా, బి.వేణుగోపాలరెడ్డి, బెటాలియన్ పరిపాలన అధికారి అశోక్ , ఆర్ ఐ పి. ఉదయ్ కుమార్, ఆర్ఎస్ఐలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్తుపల్లి నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పంతంగి మారుతి

ప్రజాపక్షం/సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పంతంగి మారుతి నియమితులయ్యారు. ఖమ్మంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బత్తిని మధు గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు. జిల్లా అధ్యక్షుడు బత్తిని మధు గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కె.వి. కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్తుపల్లి పట్టణానికి చెందిన పంతంగి మారుతిని నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమిస్తూ అధికారికంగా బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు యాదవ్, జిల్లా గౌరవ సలహాదారు పద్మచారి, జిల్లా ఉపాధ్యక్షుడు పార్థసారథి, జిల్లా కార్యదర్శి మక్కాల వెంకన్న, యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గునిగంటి వీరన్న, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి చిన్నంశెట్టి రామకృష్ణ, బీసీ ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నూతన ఆర్డీవో

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన ఎన్. శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎన్. శ్రీనివాస్ కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఎన్. శ్రీనివాస్‌కు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

ప్రజాపక్షం/ బోనకల్ : బోనకల్ మండల కేంద్రంలోని సినిమాహాల్ సెంటర్లో నిత్యం వాహనాల రద్దీ, వ్యాపారం కూడలి కావటం వలన మూడు రోడ్డులు ఒకే చోట కలిసే జంక్షన్ అవడం వలన ఇక్కడ నిత్యం రోడ్డు ప్రమాదాలు జరిగి అనేక మంది గాయాలపాలవుతున్నారని సిపిఎం నాయకులు అన్నారు. ప్రమాదాలకు నివారణకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం రైతువేదికలో జరుగుతున్న ప్రజాపాలనలో సిపిఎం గ్రామశాఖ ఆధ్వర్యంలో దరఖాస్తు అందచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ చౌరస్తాలో ఇప్పటి వరకు వాహన ప్రమాదాల వలన ఇద్దరు మృతి చెందారని, అందువల్ల వెంటనే సంబంధిత అధికారులు మరో ప్రమాదం జరగకముందే ప్రమాదాల నివారణకు రింగ్ ఏర్పాటు చేయాలని, డివైడర్, స్పీడ్ బేకర్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం డివిజన్ కమిటీ సభ్యులు తెల్లాకుల శ్రీనివాసరావు, గుగులోతు పంతు, దొండపాటి సత్యనారాయణ, వార్డు సభ్యులు ఉప్పర శ్రీను, ఎరగాని నాగరాజు, నాయకులు గద్దె రామారావు, గడ్డికొప్పుల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం పట్ల నిర్లక్ష్యం చేయవద్దు

మున్సిపల్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ 6వ వార్డులో మున్సిపాల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ సోమవారం పర్యటించారు. ఉదయం 6గంటలకు వార్డులోకి వెళ్లిన చైర్‌పర్సన్ చంద్రకళ మున్సిపాల్ సిబ్బందితో వార్డులోని స్థూపం బజార్‌లో డ్రైనేజీ క్లియరెన్స్, పారిశుద్ధ్యంపై శానిటేషన్ అధికారి వీరన్నతో మాట్లాడారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ చంద్రకళ వార్డులోని పారిశుద్ధ్య పనులపై అక్కడున్న కార్మికులకు పలు సూచనలు చేశారు ప్రజలకు పనుల విషయంలో ఎలాంటి ఇబ్బంది కలగవద్దని, ప్రతిరోజు వార్డులో చెత్త సేకరించి ఆటోలు తిరగాలి, డ్రైనేజీలు శుభ్రంగా ఉంచాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో తోటకూర శ్రీకాంత్, యు.పూర్ణ, జవాన్, గాజుల శ్రీను, నంద్రు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ 11వ వార్డు కౌన్సిలర్ దొంతబోయిన వెంకటేశ్వర్లు సోమవారం వార్డులో శిధిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు ఎంత మంది ఉన్నారు అనే విషయాలను కౌన్సిలర్ వెంకటేశ్వర్లు అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు, చిన్న పిల్లలకు అందాల్సిన పౌష్టికాహార పదార్థాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వార్డులో డ్రైనేజీలో శుభ్రపరిచే ప్రాంతానికి వెళ్లి ప్రజలకు ఎలాంటి పారిశుద్ధ్యం సమస్యలు తలెత్తకుండా చూడాలని మున్సిపాల్ సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

ప్రజాపక్షం/వైరా: వైరా మండల కొండకొడిమ గ్రామంలో సోమవారం మండల అభివృద్ధి అధికారి సక్రియ గ్యారమ సర్పంచ్ వినోద్‌కుమార్‌తో కలిసి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడున్న కార్మికులను పలు సమస్యల గురించి ఎంపిడివో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపిడివో మాట్లాడుతూ ప్రజలకు అనుకూలంగా పనులు జరగాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపివో అనురాధ, ఉపాధిహామీ సిబ్బంది గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రసాయనాలు వద్దు.. సహజ రంగులే ముద్దు..!

ప్రజాపక్షం/చింతకాని : కాముని దహనం మరుసటి రోజు చిన్నాపెద్ద తేడా లేకుండా రంగుల్లో మునిగితేలుతూ హోలీ వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీ. అయితే ప్రస్తుత సాంకేతిక అభివృద్ధి .. బిజీ లైఫ్ లో ఎవరూ సహజరంగులను తయారు చేసుకోకుండా.. కేవలం మార్కెట్‌లో లభిస్తున్న కృత్రిమ రంగులతోనే హోలీ వేడుకల్లో ఎంజాయ్ చేస్తున్నారు.కానీ ఈ కృత్రిమ రంగులతో హోలీ ఆడుకుని శరీరానికి పూసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు తప్పవని వైద్య నిపుణులు అంటున్నారు. ప్రధానంగా చర్మ సంబంధిత వ్యాధుతో పాటు కంటి చూపు కోల్పోయే ప్రమాదం లేకపోలేదని చెబుతున్నారు.అందువల్ల రసాయన రంగులు కాకుండా సహజసిద్ధమైన రంగులతో వేడుకలు జరుపుకోవాలని సూచిస్తున్నారు. రసాయన రంగులకు బదులు గోరింటాకు పొడి, కుంకుమ, పసుపు, టమాటా గింజలు, మోదుగు పూల పొడితో తయారు చేసిన రంగులను హోలీలో ఉపయోగించడం వల్ల చర్మానికి ఇబ్బంది ఉండదు.

నిర్లక్ష్యాన్ని వీడాలి..

హోలీ ఆనందం కుటుంబంలో విషాదం నింపకుండా చూసుకోవాలి. ఏటా ఏదో ఒక చోట చెరువులు, వాగులు, కుంటల వద్ద స్నానం కోసం వెళ్లి యువత మృత్యువాత పడుతున్నారు. చెరువులో జలాశయాల వద్ద సెల్ఫీలు సరదాలకు పోయి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. హోలీ రోజున జాగ్రత్తలు పాటిస్తే నిండు జీవితాన్ని ఆనందంగా గడపవచ్చు

సూచనలు..

హోలీ ఆడటానికి ముందు ముఖానికి మాయిశ్చరైజర్ , తలకు నూనె రాసుకోవడం ఉత్తమం.

రంగుల్లో ఆయిల్స్ లేదా నీటిని కలపకుండా హోలీ ఆడితే నీటివృధాను అడ్డుకోవచ్చు.

ఎరుపురంగు కోసం బీట్రూట్, మోదుగు పూలు, గులాబీ, మందారం వాడాలి

పసుపు రంగు కోసం పసుపు, ఆకుపచ్చ రంగు కోసం ఆకుకూరల మిశ్రమం వాడొచ్చు.

సహజ రంగుల్లో లభించే యాంటీయాక్సిడెంట్లు చర్మవ్యాధులను నియంత్రించి చర్మాన్ని మృదువు చేస్తాయి.

కృత్రిమ రంగులతో ఇబ్బందులు.

నలుపు లో లెడ్ ఆక్సైడ్ మూత్రపిండాల వైఫల్యాలకు దారి తీస్తుంది.

కృత్రిమ ఆకుపచ్చరంగుతో కాపర్ సల్ఫేట్ కంటి దురద, వాపు వైఫల్యాలకు దారి తీస్తుంది.

వెండి రంగు అల్యూమినియం బ్రోమైడ్ క్యాన్సర్ కారకం.

నీలి రంగు పుసియన్ , బ్లూ చర్మ సంబంధ వ్యాధులు, మెర్క్యూరీ సల్ఫేట్ (ఎరుపు) క్యాన్సర్ కారణమవుతాయి.

ఫాదర్లు, గులాల్ ,లెడ్, బ్రోమియం, నికెల్, మెర్క్యూరీ, కాపర్, జింక్, వినికిడి లోపం, ఎనర్జీ, ఆయాసం మెదలగు దుష్ఫలితాలకు దారి తీస్తాయి.

రసాయన రంగులు వాడొద్దు..డాక్టర్ అల్తాఫ్(ప్రాథమిక ఆరోగ్యకేంద్రం చింతకాని)

పండుగ మోజులో కెమికల్స్ కలిపిన రంగులను వాడితే ప్రమాదం తెచ్చుకున్నట్టే. రంగుల నుంచి వచ్చే పొడ పీల్చుకోవడం వల్ల ఊపిరితిత్తుల సమస్యతో పాటు శ్వాస సంబంధిత వ్యాధులతో ఇబ్బంది తప్పదు. రంగులు కంటిలో పడితే శాశ్వత అంధకారం సైతం రావచ్చు.స్కిన్ ఎలర్జీకి సైతం గురవుతారు.సహజ రంగులతో ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

ప్రాణాలతో చెలగాటం వద్దు.. షేక్ నాగుల్‌మీరా (ఎస్సై చింతకాని)

రంగుల పండుగ పూర్తయిన తర్వాత చాలామంది యువకులు స్నానం చేసేందుకు చెరువులు, బావులు, జలాశయాల వద్దకు వెళ్తుంటారు. అలా కాకుండా ఇంటి వద్దనే రంగులను కడుక్కోవడం ఉత్తమం . చెరువులు , బావుల వద్దకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు.

దళిత క్రైస్తవుల కోసం పార్లమెంట్‌లో గళమెత్తుతా..

- కరుణగిరి ముగింపు వేడుకల్లో ఎంపీ రామసహాయం

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : దళిత క్రైస్తవులకు ఎస్‌సీ రిజర్వేషన్ వర్తింపు చేయడానికి పార్లమెంటులో గళమెత్తుతానని ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న కరుణగిరి పుణ్యక్షేత్ర వేడుకలు సోమవారం ఐదురోజుతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ హాజరయ్యి మాట్లాడారు...ఎస్‌సీ రిజర్వేషన్లు అమలులో ఉన్న తారతమ్యాలను తొలగించడానికి పార్లమెంటులో తన వాణిని వినిపించి దళిత క్రైస్తవులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలిపారు. క్రైస్తవం ప్రజలందరి సుఖ సంతోషాలను కోరుకుంటుందని, అందుకే తాను క్రైస్తవ మతాన్ని అభిమానిస్తానన్నారు. కరుణగిరి పుణ్యక్షేత్రం క్రైస్తవులకు గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రఖ్యాతి చెందిందని, కొనియాడారు. వాటికన్ సిటీ జకద్గురువు పోప్ చే నియమించిన కార్డినల్ బిషప్ డాక్టర్ పూల అంతోని మన తెలుగు వారు కావడం గొప్ప గౌరవం అన్నారు. ఏసు మర్గం అనుసరణీయమైందని, ప్రతి ఒక్కరూ ఆచరిస్తే మహోన్నత సమాజం ఏర్పడుతుందన్నారు. మతపెద్దలు, భక్తులకు, క్రైస్తవులకు ఎలాంటి కష్టం వచ్చినా తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. అనంతరం కార్డినల్ బిషప్ డాక్టర్ పూల అంతోనిని ఉమ్మడి జిల్లా బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్‌లను ఎంపీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఏదులాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్ బాబు, మేత్రాసనం ప్రోక్రేటర్ పాధర్ సూరేపల్లి ఐజక్, విజి ఫాదర్‌శౌరి, కరుణగిరి డైరెక్టర్ జ్యానేష్, పాలేరు విచారణగురువు కొమ్ము అంతోని, తెలంగాణ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలు ప్రాంతాల మత గురువులు, పాధర్స్, బ్రదర్స్, సిస్టర్స్, విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఓ కార్యాలయం ముందే మురుగు గుంత..!

-దుర్వాసన, దోమల బెడదతో ప్రజల ఇక్కట్లు -పట్టించుకోని అధికారులు

ప్రజాపక్షం/ బోనకల్ : మండల ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాల్సిన బోనకల్ ఎంపిడిఓ కార్యాలయం ఎదుటే అపరిశుభ్ర పరిస్థితులు నెలకొనడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దంపడుతోంది. కార్యాలయం ముందు మురుగు నీరు రోజులుగా పారుతూ చిన్నపాటి చెరువులా మారినా సంబంధిత అధికారులు మాత్రం చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ప్రతిరోజూ కార్యాలయానికి వచ్చే ప్రజలు మురుగునీటి మధ్యగానే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దుర్వాసనతో పరిసరాలు అసహ్యకరంగా

మారగా నిల్వ నీటి కారణం దోమలు విపరీతంగా పెరిగి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పరిశుభ్రతపై సమావేశాలు, ప్రచారాలు నిర్వహించే అధికారులు తమ కార్యాలయం ఎదుటే ఉన్న సమస్యను పట్టించుకోకపోవడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారి తీసింది. పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు లేకపోవడం బాధాకరమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే మురుగు నీటి సమస్యను పరిష్కరించపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

అంకుబాబు సేవలు అభినందనీయం

- ఎంఎల్‌ఏ కూనంనేని

ప్రజాపక్షం/ కొత్తగూడెం : ఎంపిడిఓగా అంకుబాబు ప్రజలకు చేసిన సేవలు అభినందనీయమని, తన పదవీ కాలంలో ప్రజలకు అందించిన సేవలు కలకాలం గుర్తుండిపోతాయని ఎంఎల్‌ఏ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీ దేవిపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సుదీర్ఘ కాలం పాటు పనిచేసిన అంకుబాబు పదవీ విరమణ కార్యక్రమంలో చాతకొండ రోడ్‌లోని ఓ సాయి ఫంక్షన్ హాల్లో సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిధులుగా కూనంనేనితో పాటు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా హాజరై అంకుబాబు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ కూనంనేని మాట్లాడుతూ ప్రభుత్వాధికారిగా సామాన్య ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ మండలాభివృద్ధిలో కీలకపాత్ర పోషించారని చెప్పారు. ప్రజల మనస్సు గెలుచుకున్న అధికారిగా ఆయన సేవా నిరతిని అంతా ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. నిబద్ధతతో పనిచేసే అధికారుల వల్ల ప్రభుత్వ పథకాలు అర్హులకు అందుతాయని, అంకుబాబు తన పదవీ కాలంలో ఎక్కడా రాజీ లేకుండా పనిచేశారని ప్రశంసించారు. సుదీర్ఘ సర్వీసు పూర్తి చేసుకున్న ఆయన శేషజీవితం సుఖ సంతోషాలతో హాయిగా సాగాలాని ఆకాంక్షించారు.

విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయటమే లక్ష్యం

-ఎంఈవో సూరయ్య

ప్రజాపక్షం/చంద్రుగొండ: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడమే లక్ష్యంగా ఈ బాలమేళా నిర్వహించడం జరిగిందని ఎంఈవో సూరయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని రేపల్లెవాడ గ్రామంలో గల జిల్లా పరిషత్ పాఠశాలలో మండల స్థాయి బాలమేళ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలమేళాలో మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులను జిల్లా స్థాయికి పంపించడం జరుగుతుందన్నారు. అదే విధంగా జిల్లా స్థాయిలో రాణించి రాష్ట్ర స్థాయిలో కూడా ఎంపిక కావాలన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ప్రతి రోజు పాఠశాలకు రావాలని, ఉపాధ్యాయులు బోధించి పాఠాలను శ్రద్ధ వినాలని తెలిపారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు రాత పరీక్షలు విభాగంలో ఒక్కొక్క క్లాస్ నుండి ఒక్కొక్కరిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. అలాగే స్టోరీ టెల్లింగ్ నుండి ఒక క్లాస్ నుండి ఒక్కొక్కరిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఎంపికైన విద్యార్థులకు బహుమతి ప్రధానంతో పాటు ప్రశంసా పత్రం అందజేశామన్నారు. ఈకార్యక్రమంలో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రామ చందర్, ఉప్పల్ రెడ్డి, ఉపాధ్యాయులు అజ్మీర రమేష్, శ్రీరాములు, రామకృష్ణ, సిఆర్ పిలు బానోత్ వీరన్న, చందూలాల్, కిరణ్ కుమార్, వెంకటేశ్వర్లు, రవి, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన బియ్యం పంపిణీలో డొల్లతనం..!

-పత్తా లేని సివిల్ సప్లై డిటి విజయ్ బాబు

ప్రజాపక్షం/కూసుమంచి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థిని విద్యార్థులకు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలు కొందరు అధికారుల నిర్లక్ష్యం వల్ల అనేక విమర్శలకు గురవుతుంది. సంవత్సరాలు గడుపుతున్న మధ్యాహ్న భోజన బియ్యం పంపిణీ తూకంలో లోపాలు మాత్రం ఎక్కడ సరిద్దుకున్నట్లు కనిపించడం లేదు. వివరాల్లోకి వస్తే మధ్యాహ్న భోజన పథకానికి కూసుమంచి మండలంలో అందిస్తున్న బియ్యం పంపిణీలో అంతా డొల్లతనం కనిపిస్తుందని ఆయా విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల నుండి విమర్శలు వినిపిస్తున్నాయి. మధ్యాహ్న భోజనానికి పంపిస్తున్న బియ్యం పంపిణీల్లో అనేక అవకతవకలు తప్పుడు తడకలతో పాఠశాలలకు బియ్యం చేరుస్తున్నారని ముఖ్యంగా బియ్యం పంపిణీ పరిశీలించినట్లయితే స్టాక్ పాయింట్ గోడంలో కాటా వేసినప్పుడు ఒక రకంగా అనగా ఒక్కొక్క బ్యాగ్(టిక్కి గోనె బస్త)గోనె బస్తాలలో 50 కేజీల వెయిట్ చూపించి ఎన్ని క్వింటాలు అయితే అన్ని క్వింటాలకు లెక్క చెబుతూ బ్యాగు వెయిట్ లెక్కలు కూడా అందిస్తున్నప్పటికీ తీరా పాఠశాలల్లోకి బియ్యం చేరే వరకు పరిశీలిస్తే 50 కేజీల బస్తాలలో ఒక్కో బస్తాకు 4 నుండి 5 కేజీల బియ్యం తక్కువ రావడం అటు ఉపాధ్యాయులకు ఇటు విద్యార్థులకు ఒక సమస్యగా మారింది. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు 100 గ్రాముల బియ్యం పంపిణీ చేస్తుండగా హైస్కూల స్థాయి విద్యార్థులకు 150 గ్రాముల బియ్యాన్ని మధ్యాహ్నం భోజనంలో అందిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల హాజరుశాతాలు మొదలైనవి పరిశలించినప్పటికీ నెల చివరు వచ్చే సరికి మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు సరిపడినంతగా ఇంకా నెల చివరి వరకు అందించలేని దుస్థితికి నెట్టబడింది కారణంగా తూకంలో తేడాలు రావడమే ప్రధానమైనటువంటి కారణంగా నిలుస్తున్నాయి. దీనితో మండలంలోని ఆయా పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కడుపునిండా పూజించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే విషయమై ఆయా పాఠశాలలను పరిశీలించిన క్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు ద్వారా కొన్ని వాస్తవాలు బయటకు రావడం జరుగుతుంది. ఇక తూకంలో తేడా 10 క్వింటాలు, 5 క్వింటాలు, 4 క్వింటాలు, 1 క్వింటా 50 కేజీలు వివిధ పాఠశాలలో దిగుమతి చేసుకున్న పరిస్థితుల్లో ఒక్కో బస్తాకు నాలుగు నుండి ఐదు కేజీల చొప్పున తక్కువ రావడం విద్యార్థులకు పూర్తి స్థాయిలో భోజనాన్ని కూడా అందించలేని పరిస్థితి నెలకొన్నది.

పత్తా లేని సివిల్ సప్లై డిటి విజయ్ బాబు...

మండలంలో వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ అవుతున్న మధ్యాహ్నం భోజనం బియ్యం విషయమై వివరణ కొరకై తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు సంబంధిత సివిల్ సప్లై డిటి విజయ్ బాబును సంప్రదించాలని గత రెండు వారాలుగా ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఫోనుకు స్పందించడం(9492309159)లేదు. విజయ్ బాబును స్వయంగా కలిసి మాట్లాడటానికి శనివారం నాడు ఖమ్మంలో నూతన కలెక్టరేట్‌లోని సివిల్ సప్లై కార్యాలయం వెళ్లిన అక్కడ తను లేకుండా పోవడం ఆఫీసులో ఆరా తీయగా స్థానిక అధికారులు తమ ఫీల్డ్ వర్క్‌కి వెళ్ళారని చెప్పడం జరిగిందని, అక్కడే ఉండి ఫోన్‌లో సంప్రదించాలని ప్రయత్నం చేసిన ఫోన్ అందుబాటులోకి రాకపోవడం, ఈ రకంగా ఆఫీస్‌కి వెళ్తే ఫీల్డ్‌లో ఉన్నట్లు ఫోన్ చేస్తే ఫోన్ అందుబాటులో లేకపోవడం సివిల్ సప్లై డిటి పని విధానం నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నదని ప్రజలు భావిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులకు అందిస్తున్న బియ్యం పంపిణీ అవకతవకలపై డిటి విజయ్ బాబు ఏ మాత్రం కూడా పరిష్కారం చూపలేకపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సివిల్ సప్లై ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సంబంధిత అధికారి పనిని చక్కదిద్దాలని విధుల పట్ల బాధ్యతాయుతంగా పారదర్శకంగా వ్యవహరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాపక్షం/భద్రాచలం : ప్రజావాణిలో అందిన సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తహశిల్దార్ దనియాల వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక తహశిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి సోమవారం విశేషస్పందన లభించింది. ఈ సందర్భంగా పలువురు తహశిల్దార్‌కు విన్నపాలు అందజేశారు. గ్రామపంచాయితీ, ఎలక్ట్రికల్, రెవెన్యూ శాఖ, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన నాలుగు ఆర్జీలు అందాయి. ఈ సందర్భంగా దనియాల మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించడం జరిగిందన్నారు. రెవెన్యూశాఖకు సంబంధించిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని, మధ్య దళారులను ఎవ్వరినీ ఆశ్రయించకుండా నేరుగా తహశిల్దార్ కార్యాలయానికి చేరుకుని ప్రజావాణిలో సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్, విద్యుత్, ఐకేపి, వైద్యశాఖ, ఎంపిడిఓ కార్యాలయాల అధికారులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

ప్రజాపక్షం/భద్రాచలం : గిరిజన సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఐటిడిఏ డిడి అశోక్ అన్నారు. సోమవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో వివిధ గ్రామాల నుండి వచ్చిన గిరిజనుల నుండి ఆయన దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం వాటిని పరిశీలించి సంబంధిత అధికారులకు పంపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందిన ప్రతీ దరఖాస్తును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని, పరిష్కారానికి నోచుకోని వాటిపై సమగ్ర నివేదికలు సమర్పించాలన్నారు. గిరిజన దర్బారులో అందిన విన్నపాలు ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసి అర్హులైన వారందరికీ విడతలవారీగా ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ సున్నం రాంబాబు, ఇఇ మధుకర్, వేణు, అరుణ కుమారి, లక్ష్మి నారాయణ, గన్య, ఉదయ్, నారాయణ, ప్రభాకర్, హరికృష్ణ, భార్గవి, వెంకటేశ్వర్లు, ముత్తయ్య, మోహన్, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

సహజన సిద్ధమైన రంగులతో హోళీ సంబరాలు జరుపుకోవాలి

ప్రజాపక్షం/బూర్గంపాడు: హోళీ పండుగ సందర్భంగా బూర్గంపాడు మండల ప్రజలందరికీ బూర్గంపాడు ఎస్ఐ మేడా ప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. హోళీ పండుగను సాంప్రదాయబద్ధంగా, పరస్పర గౌరవంతో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ప్రజలను కోరారు. హోళీ వేడుకల సందర్భంగా సహజసిద్ధమైన రంగులను మాత్రమే ఉపయోగించాలని, హానికరమైన రసాయనికి రంగులను వాడకూడదని సూచించారు. ఇతరులకు ఇబ్బందులు కలిగించే విధంగా బలవంతంగా రంగులు చల్లడం, నీటి బెలూన్లు విసరడం వంటి చర్యలు చేయరాదని తెలిపారు. రహదారులపై వాహనదారులకు ఆటంకం కలిగించే విధంగా ప్రవర్తించవద్దని తెలిపారు. ఎవరైనా ఆకతాయిలు వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మండల వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. యువత వాహనాలను అతివేగంగా నడపకుండా జాగ్రత్తగా ఉండాలని, రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈత రాని వారు చెరువులు, కుంటలు, కాలువల వద్దకు వెళ్లకూడదని, చిన్న పిల్లలను ఆటువంటి ప్రదేశాలకు తీసుకెళ్లరాదని విజ్ఞప్తి చేశారు. లోతైన నీటిలోకి వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.

ఉపాధ్యాయులకు అభ్యంతరకరంగా ఉన్న విద్యా కమిషన్ సిఫార్సులు

ప్రజాపక్షం/ బోనకల్ : తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ సమర్పించిన విద్యావిధాన పత్రం 2026 అమలు చేసే ముందు ఉపాధ్యాయ సంఘాలతో తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చర్చించాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టిఎస్‌యుటిఎఫ్) ఖమ్మం జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ డిమాండ్ చేశారు. బోనకల్ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమీషన్ సిఫార్సుల్లో కొన్ని ప్రభుత్వ విద్యారంగానికి మేలు చేసేవిగా ఉన్నప్పటికీ, ఉపాధ్యాయులకు సంబంధించిన కమీషన్ చేసిన సిఫార్సులు చాలా వరకు అభ్యంతరకరంగా ఉన్నాయని తెలిపారు. ఆ సిఫార్సులు ఉపాధ్యాయుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయని, ఇలాంటి సిఫార్సుల విషయంలో విద్యా కమిటీ చైర్మన్ పునరాలోచించుకోవాలని వారు కోరారు. ఉపాధ్యాయ వృత్తి గౌరవాన్ని పెంచేవిగా ఎక్కువ మంది ఈ వృత్తిలోకి వచ్చే విధంగా ఉండాలంటే ఎక్కువ వేతనాలు ఉండాలనే జాతీయ విద్యా కోఠారి కమిషన్ సూచనలకు భిన్నంగా సిఫార్సు చేశారని విచారం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల వేతనాలు ప్రత్యేకంగా ప్రభుత్వాలు ఇచ్చేవి కావని, రాష్ట్రంలోని ఉద్యోగులందరికీ వర్తించేలా పిఆర్సీ సిఫార్సుల మేరకే ఇస్తారని గుర్తు చేశారు. అదేవిధంగా ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టిఎస్‌యుటిఎఫ్ జిల్లా నాయకులు సద్దాబాబు, బోనకల్ మండల అధ్యక్షులు చిన్న రంగారావు, మండల ఉపాధ్యక్షులు పి.గోపాలరావు, మండల కోశాధికారి పి.నర్సింహారావు, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ జల్లా కోటయ్య, సోషల్ మీడియా కన్వీనర్ నరేంద్ర, రామారావు, సిహెచ్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలపై బురద చల్లే ప్రయత్నం తగదు

-అర్హులైన పేదలను ప్రభుత్వం ఆదుకుంటుంది
-మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేతలు

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : అభివృద్ధికి మారుపేరైనా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై ప్రతిపక్షాలు బురద చల్లే ప్రయత్నం మానుకోవాలని కాంగ్రెస్ నాయకులు హితవు పలికారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ వడ్డెబోయిన నర్సింహారావు లు మాట్లాడుతూ అభివృద్ధి ప్రధాత అయినా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పై ప్రతిపక్షాలు బురద చల్లే ప్రయత్నం చేస్తున్నాయని వీటిని మానుకోవాలన్నారు. మచ్చ లేని నాయకునిగా తుమ్మల నాగేశ్వరరావు ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. వెలుగుమట్ల భూదాన్ భూముల్లో అక్రమార్కులు, దళారులు పేదల వద్ద డబ్బులు తీసుకుని ప్లాట్లు కట్టబెట్టారన్నారు. నాడు కేటిఆర్, అజయ్‌కుమార్ మంత్రులుగా ఉండి భూదాన్ భూముల్లోని నిరుపేదలకు పట్టాలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రెవెన్యూ అధికారుల ద్వారా భూదాన్ భూముల్లో గుడిసెలు కోల్పోయిన బాధితులకు సంబంధించి సర్వే చేయించడం జరుగుతుందని అర్హులైన పేదలకు ఇండ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బెడద సత్యనారాయణ, దొడ్డా అశోక్, తాళ్లూరి హన్మంతరావు, సయ్యద్ ముజాహీద్ హుస్సేన్, సయ్యద్ గౌస్, కొత్తా సీతారాములు పాల్గొన్నారు.

ఎస్‌బిఐటిలో వ్యక్తిత్వ వికాసంపై సదస్సు

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలని కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన వ్యక్తిత్వ వికాస సదస్సులో గుండాల కృష్ణ మాట్లాడుతూ ప్రపంచ గతిని మార్చగల సత్తా విద్యార్థుల తరగతి గది నుంచే మొదలవుతుందన్నారు. నేటి తరం యువత అతి చిన్న విషయాలకే ఆత్మహత్యలకు ప్రేరేపితులవుతున్నారన్నారు. వ్యక్తిగత అలవాట్లలో మార్పులు క్రమశిక్షణ ద్వారా వీటిని అధిగమించవచ్చునన్నారు. ముఖ్య అతిథిగా ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు గంపా నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ బోర్డ్ రూమ్ నిర్ణయాలను తీసుకునే, ప్రణాళికలను సిద్ధం చేసే ఖర్మాగారమని తెలిపారు. తరగతి గదిలోనైనా తప్పులు దొర్లే అవకాశం ఉంటుందని బోర్డ్ రూములో తప్పుడు నిర్ణయాలు, వ్యవస్థను, ఉద్యోగస్తులను, కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తాయన్నారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ఉండాలని సూచించారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ క్లాస్ రూమ్‌కు బోర్డ్ రూమ్ అనే అంశంపై తమ కళాశాల విద్యార్థులకు జీవిత విలువలను వ్యక్తిగత క్రమశిక్షణపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. పోటీ ప్రపంచంలో ఎదురయ్యే ప్రతి సవాల్‌ను ఎదుర్కొని నిలబడగలిగే ధైర్యాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని కళాశాల వైస్ ఛైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. ప్రిన్సిపాల్ డా॥ రాజ్‌కుమార్ మాట్లాడుతూ తరగతి గదికి బోర్డు రూముకు ఉన్న ఏకైక పోలిక టీమ్ వర్క్ అని తెలిపారు. విద్యార్థులు ఎలాగైతే ప్రాజెక్ట్, వర్క్‌షాపులలో కలిసి పనిచేస్తారో అదేవిధంగా బోర్డ్ రూములలోనూ సమిష్టి పనితీరు అలవర్చుకోవడం మంచిదని సూచించారు. అనంతరం ముఖ్య అతిథి గంపా నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, హెచ్‌వోడిలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆ వార్డులో వారికే వరుస విజయాలు..!

-గెలుపు ముళ్ళపాటి కుటుంబానికి సొంతం
-వార్డు ప్రజలతో ముళ్ళపాటి కుటుంబానికి ఎనలేని ప్రేమ
-అక్క, అన్న, తల్లి...పిలుపుతోనే వారి సంబంధాలు

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు అంటే గర్తు వచ్చేది ముళ్ళపాటి కుటుంబం, ఆ కుటుంబం జరిగిన ప్రతి ఎన్నికల్లో గెలుపు తప్ప ఓటమి ఎరుగని కుటుంబం, వార్డు మెంబర్ నుంచి ప్రారంభమై ఎంపిటిసి మున్సిపాల్ వైస్ చైర్మన్, ప్రస్తుతం మున్సిపాల్ కౌన్సిలర్‌గా ఆ కుటుంబం నిత్యం ప్రజల మధ్యనే ప్రజలకు సేవ చేస్తూ ప్రజాప్రతినిధులుగా కొనసాగుతున్నారు. ముళ్ళపాటి రంగా, సీతారాములు ఇద్దరు అన్నదమ్ములు ఆ అన్నదమ్ములు ఇద్దరు నిత్యం ఆ వార్డులో ఉన్న ప్రజలతో కులమతాలకు అతీతంగా వారి కుటుంబంలో ఒకరిలా కలిసిమెలిసి పోతూ ఉంటారు. ఉదయం లేవగానే ఇద్దరు అన్నదమ్ములు వార్డులో పర్యటించి ప్రతి ఇంటికి సొంత బిడ్డ లాగా వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారు, ఆపదొచ్చిన కుటుంబానికి అండగా ఉంటారు. అలా పలకరింపు వారికి ఆ వార్డులో ఓ గుర్తింపు ఓ నమ్మకం తీసుకొచ్చింది. అక్క చెల్లి అన్న తమ్ముడు బాబాయ్ పిన్ని అని నిత్యం వారు వార్డు ప్రజలతో పిలిచే మాటలు, ఆ మాటలు ముళ్ళపాటి కుటుంబాన్ని వార్డు ప్రజలకు కుటుంబంగా భావించారు అని చెప్పవచ్చును. వార్డు మెంబర్‌గా ప్రజలకు సేవలు అందించిన ముళ్ళపాటి సీతారాములు తర్వాత ఎంపిటిసిగా బాధ్యతలు నెరవేర్చారు. సోమవరం గ్రామపంచాయతీ నుండి వైరా మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత తొలి పాలకవర్గంలో 13వ వార్డు నుంచి గెలిచిన ముళ్ళపాటి సీతారాములు తొలి వైస్ చైర్మన్ పదవిని చేపట4ఱారు. అనంతరం ఇటీవల జరిగిన మున్సిపాల్ ఎన్నికల్లో ముళ్ళపాటి సీతారాములు సతీమణి ముళ్ళపాటి విజయ 13వ వార్డు కౌన్సిలర్‌గా విజయం సాధించారు. రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుండి వరుసగా నాలుగు పర్యాయాలు ఆ కుటుంబం ఎన్నికల్లో పోటీ చేసిన ప్పుడు విజయం సాధించడం తప్ప ఓటమి ఎరగని కుటుంబంగా వైరాలో ఇప్పుడు చర్చ కొనసాగుతుంది. ఎందుకు ఆ కుటుంబంతో అంత ప్రేమ ఆ కుటుంబం ఆ వార్డు ప్రజలు నాలుగు పర్యాయాలు ఎన్నుకోవడానికి కారణాలు ఏమిటి అని అన్వేషిస్తే ఒకటే కారణం, వారు ఆ వార్డు ప్రజలపై చూపే ప్రేమ వారిపై నమ్మకం వారు ఇచ్చిన మాట కట్టుబడి ఉంటారని వాదన వార్డు ప్రజల్లో వినిపిస్తుంది. ఇదే క్రమంలో ముళ్ళపాటి విజయలక్ష్మి సీతారాములు ప్రజాపక్షంతో మాట్లాడుతూ ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని ఎప్పుడు నిలబెట్టుకుంటాం, ఎక్కడ పోగొట్టుకోము, ఆపదొచ్చిన ప్రతిఒక్కరికి అండగా ఉంటాం, రాజకీయాలతో పనిలేదు వార్డు ప్రజలతో ఉన్న సంబంధాలే మాకు ముఖ్యం, రాజకీయాలు ఎన్నైనా ఉండొచ్చు కాని ప్రజల్లో వారితో ఉన్న మాకు సంబంధం మాకు ఒక కుటుంబం లాంటి సంబంధం. ఆ కుటుంబానికి ఎక్కడ ఇబ్బంది కలగనీయం అని ఆయన తెలిపారు. భవిష్యత్తులో కూడా మ్మల్ని ఆదరిస్తున్న ప్రజలకు మరిన్ని అభివృద్ధి సంక్షేమ పథకాలను అందించేందుకు నిరంతరం ప్రజల మధ్య ఉంటాం, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సహకారంతో వార్డుని మరింత అభివృద్ధి పథంలో ముందు ఉంచుతానని ముళ్ళపాటి విజయలక్ష్మి సీతారాములు తెలుపుతున్నారు.

వెంకయ్య చిత్రపటానికి సిపిఐ నేతలు నివాళి

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురం మున్సిపాలిటీ 29డివిజన్ వరంగల్ క్రాస్‌రోడ్డుకు చెందిన పెద్ద వెంకయ్య ఇటీవల మృతి చెందాడు. సోమవారం ఇంటి వద్ద దశదినకర్మను నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యుడు చెరుకుపల్లి భాస్కర్, 28వ డివిజన్ కౌన్సిలర్ దండి రంగారావు, 29వ డివిజన్ సిపిఐ సెక్రటరీ వెంపటి రాము, మున్సిపాలిటీ నాయకులు పొన్నెకంటి రామకృష్ణ, మేళ్లచెర్వు గురవయ్య, మేళ్లచెర్వు వెంకన్న, మేళ్లచెర్వు రవి, ఆరెంపుల సతీష్, యువజన సంఘం సభ్యులు మిరియాల నరుణ్‌తేజ్,మేళ్లచెర్వు నరేష్, గుండె శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌కిడ్జ్‌లో హోలీ సంబురాలు

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో సోమవారం ముందస్తు హోలీ సంబురాలను ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలోని వివిధ తరగతుల విద్యార్థులు ఒకరినొకరు సాంప్రదాయ రంగులు పూసుకుని సరదాగా హోలీని జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలలో రంగుల కేళీ హోలీ పర్వదినానికి ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. అలనాడు బృందావనంలో శ్రీకృష్ణుడు గోపికలతోకలిసి రంగుల సంబురాలు నిర్వహించిన సంప్రదాయాన్ని ప్రతి యేటా జరుపుకుంటున్నామన్నారు. రసాయనిక రంగుల వాడకం ఆరోగ్యానికి హానికరమని సహజ రంగులను హోలీ వేడుకల్లో ఉపయోగించాలని తెలిపారు. డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్‌లో హోలీ వేడుకలు

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీలో గల స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ పాఠశాలలో హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం పాఠశాలలో చిన్నారులు ముందస్తు హోలీ సందర్భంగా తమ తోటి స్నేహితులకు, ఉపాధ్యాయులకు రంగులు చల్లుతూ ఒకరినొకరు హోలీ శుభాకాంక్షలు తెలుపుకుంటూ సరదాగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కొండా కృష్ణవేణి లు మాట్లాడుతూ హోలీ పండుగను కాముని దహనం అని కూడా అంటారని ఈ పండుగను దేశ వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారన్నారు. తమ పాఠశాలలో విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. సంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులకు తెలిపేలా వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రసాయనిక రంగులను వాడకుండా సహజసిద్ధమైన రంగులను వినియోగించి హోలీని జరుపుకోవాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

త్రివేణిలో ఫన్ పెస్ట్

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో ప్రైమరీ విద్యార్థులకు ఫన్ పెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం హరిత గార్డెన్స్‌లో ఫన్ పెస్ట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యులు జంగాల గోపి కృష్ణ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆట పాటల్లో కూడా ముందుండి పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. చిన్న పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధవహించాలన్నారు. మరో అతిథి డాక్టర్ నాగుబండి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలలో ముందుండాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లాస్‌లో ప్రతిభ చూపిన వారికి, క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి, అత్యుత్తమ హాజరు కలిగిన విద్యార్థులకు మెమోంటోలు, హౌజ్ ట్రోఫీలను అందించి అభినందించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, గీతాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వై. వెంకటేశ్వరరావు, సివో అడ్మిన్ అప్పారావు, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భద్రాచలం ఆలయానికి తలంబ్రాలను తీసుకెళ్లిన గోపాలపేట భక్తులు

ప్రజాపక్షం/ తల్లాడ : శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రాది కొత్తగూడెం జిల్లాలో ఉన్న భద్రాచలం శ్రీ రాములోరి దేవాలయం నుండి తలంబ్రాలను చేసేందుకు గత 15రోజుల క్రితం వడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపాలపేట రామాలయం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ భక్తులందరూ ఆ వడ్లను గోటితో వలసి ముత్యాల తలంబ్రాలను తయారు చేశారు. సోమవారం ఆ తలంబ్రాలను భక్తులు భద్రాచలం రామాలయానికి తీసుకెళ్లే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు పాదయాత్ర ద్వారా తలంబ్రాలను తీసుకుని రాములోరి గేయాలను ఆలపిస్తూ తలంబ్రాలను దేవాలయానికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో గోపాలపేట గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాపక్షం/పాల్వంచ : జిల్లాలో కొనసాగుతున్న ఇంటర్‌మీడియెట్ వార్షిక పరీక్షల నిర్వాహణను జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా పాల్వంచ కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, తెలంగాణ సామాజిక సంక్షేమ నివాస పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సంధర్శించారు. పరీక్షల నిర్వాహణ తీరును పరిశీలించారు. కేంద్రాలలో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లు, సిసి కెమెరాల పనితీరును, అభ్యర్థుల హాజరు నమోదు, ఇన్విజిలేటర్ల విధుల నిర్వాహణ, ప్రశ్నా పత్రాల రవాణా, భద్రత వంటి పలు అంశాలను అడిగి తెలుసుకొన్నారు.విద్యార్థులు సౌకర్యవంతంగా పరీక్షలు రాసేందుకు తగిన డెస్కులు, నిరంతర విద్యుత్ సరఫరా, ప్రథమ చికిత్సా సదుపాయాలను పరిశీలించారు. నిర్వాహ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 37 సెంటర్లలో పరీక్షలు నిర్వహింపబడుతున్నాయని అన్నారు. ఇంటర్ గణితం పేపర్ 1, వృక్షశాస్త్రం 1, రాజకీయ శాస్త్రం 1, పరీక్షలకు జనరల్ విభాగంలో 8,429 మంది, వృత్తి పర విభాగంలో (వొకేషనల్)1, 860 మంది మొత్తం 10,289 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారని చెప్పారు.వీరిలో 9, 786 మంది హాజయ్యారు.503 మంది గైర్హాజర్ అయినట్లు తెలిపారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని వెల్లడించారు. కలెక్టర్ వెంట సంభంధిత అధికారులు పాల్గొన్నారు.

ఇరవెండిలో ఆధ్యాత్మిక మహోత్సవం

-ఘనంగా సంతాన వేణుగోపాలస్వామి తిరు కళ్యాణం

ప్రజాపక్షం/బూర్గంపాడు: మండల పరిధిలోని ఇరవెండి గ్రామం భక్తి పరవశంతో మార్మోగింది. గ్రామంలో వెలసిన శ్రీ సంతాన వేణుగోపాల స్వామి దేవాలయంలో శ్రీ వారి తిరుకళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ జరిగింది. సుమారు 1400 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ప్రాచీన ఆలయం పండుగ వేళ ఆధ్మాతిక కాంతులతో కళకళ లాడింది. పవిత్ర గోదావరి నది తీరాన, భద్రాద్రి క్షేత్రం సమీపంలోని గుట్టపై వెలసిన ఈ దేవాలయం ప్రాంతీయుల ఆధ్మాత్మిక కేంద్రంగా పేరుగాంచింది. రుక్మిణి, సత్యభామ సమేతుడైన సంతాన వేణుగోపాలస్వామి దివ్య దర్శనంతో భక్తులు ఆనంద పరవశంలో మునిగితేలారు. ఆలయ ప్రాంగణం మంగళవాయిద్యాలు, వేద ఘోషలు, హారతులతో భక్తిరసమయం అయింది. తిరుణ మహోత్సవం సందర్భంగా వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి వారికి కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ తిరు కళ్యాణాన్ని పీటలపై వల్లూరిపల్లి వంశీకృష్ణ దంపతులు కూర్చొని నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. వారు భక్తి శ్రద్ధలతో స్వామివారిని సేవించి ఆశీస్సులు పొందారు. ఈ మహోత్సవంలో ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లూరు పంచాక్షరయ్య, మాజీ సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, ఐటిసి కాంట్రాక్టర్ జలగం ప్రసాద్, ఇరవెండి సర్పంచ్ బాబురావు, ఉప సర్పంచ్ మహంకాళి, వార్డు సభ్యులు, మండల అధికారులు, దేవస్థానం కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, పరిసర ప్రాంతాల నుండి భారీగా భక్తులు పాల్గొన్నారు.

భక్తులు గోటి తలంబ్రాలతో పాదయాత్ర

భక్తి ప్రపత్తులతో భద్రాచలానికి పెద్ద హరిజనవాడ వాసులు

ప్రజాపక్షం/జూలూరుపాడుః జూలూరుపాడు మండలం పెద్ద హరిజనవాడ గ్రామస్తులు భక్తిభావంతో రామనామ స్మరణతో భద్రాచలం వైపు తమ పవిత్ర పాదయాత్రను సోమవారం ప్రారంభించారు. భక్తులు గత నెల రోజులుగా అత్యంత నియమ నిష్టలతో, కఠిన ఉపవాసాలతో సిద్ధం చేసుకున్న వలసిన గోటి తలంబ్రాలను భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో సమర్పించనున్నారు. గ్రామానికి చెందిన భక్తులు సంప్రదాయక నారింజ , పసుపు రంగు దుస్తులు ధరించి, నారింజ రంగు దేవుని జెండాలతో గ్రామం నుండి బయలుదేరారు. గ్రామంలో నెలకొన్న భక్తి వాతావరణం, గ్రామస్తులందరూ ఈ యాత్రను విజయవంతం చేయడానికి ఉత్సాహంగా సహకరించడం చూస్తుంటే, వారి భక్తి ప్రపత్తులు స్పష్టంగా తెలుస్తున్నాయి. చేతితో (గోటితో) వలిచిన బియ్యంతో చేసిన తలంబ్రాలను అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఈ తలంబ్రాలను సిద్ధం చేయడానికి గ్రామస్తులు గత నెల రోజుల పాటు భక్తిశ్రద్ధలతో, కఠిన నియమాలను పాటించి, శ్రమించారు. తమ శ్రమను, భక్తిని భగవంతునికి సమర్పించే ఈ కార్యక్రమం గ్రామంలో ఒక పవిత్రమైన పండుగ వాతావరణాన్ని నెలకొల్పింది. తమ గ్రామం నుండి బయలుదేరిన భక్తులకు గ్రామ పెద్దలు, ఇతర గ్రామస్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. పెద్ద హరిజనవాడ నుండి భద్రాచలం వరకు సాగే ఈ సుదీర్ఘ పాదయాత్ర గ్రామస్తుల గాఢమైన భక్తికి, సంప్రదాయాల పట్ల వారికి ఉన్న గౌరవానికి నిదర్శనం. భగవంతుని ఆశీస్సులతో తమ పాదయాత్ర విజయవంతంగా సాగి, సీతారాముల దర్శనం, తలంబ్రాల సమర్పణ సజావుగా సాగాలని గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు. ఈ పవిత్ర కార్యక్రమం గ్రామ ప్రజల్లో ఐక్యతను మరియు భక్తి భావాన్ని మరింత పెంపొందించింది.

చండ్రుగొండలో రూ 10.50లక్షల గంజాయి స్వాధీనం

-వెల్లడించిన డిఎస్‌పి ఆదినారాయణ

ప్రజాపక్షం/చండ్రుగొండ: రూ 10.50లక్షల విలువైన 21.150 కిలోల గంజాయిని చండ్రుగొండ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కొత్తగూడెం డిఎస్‌పి ఆదినారాయణ సోమవారం చండ్రుగొండ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. డిఎస్‌పి వివరాల ప్రకారం దామరచర్ల గ్రామం శివారులోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద నమ్మదగ్గ సమాచారం మేరకు సీసీఎస్ పోలీసులు, చండ్రుగొండ పోలీసులు సంయుక్తంగా వామనాల తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా ఒడిశా నుండి చెన్నై వైపు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, వారి వద్ద గంజాయి ప్యాకెట్లు గుర్తించారు. పట్టుబడ్డ నిందితుల్లో విజయవాడకు చెందిన మేకల శ్రీనివాసరావు, ఒడిశాకు చెందిన కారం లక్ష్మ య్యతో పాటు ఒక మైనర్ బాలుడు ఉన్నట్లు తెలిపారు. వారి వద్ద నుండి 21.150 కిలోల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన గంజాయి విలువల సుమారు రూ 10.50 లక్షలు ఉంటుందన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. గంజాయి నిర్మూలన సామాజిక బాధ్యత అని పేర్కొంటూ, ఎవరైనా గంజాయి రవాణా లేదా విక్రయాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. గంజాయి పట్టివేతలో చండ్రుగొండ ఎస్ఐ శివరామకృష్ణ అంకితభావాన్ని డిఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు. ఈకార్యక్రమంలో జూలూరుపాడు సిఐ శ్రీలక్ష్మీ , ఎస్ఐ శివరామకృష్ణ, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

ప్రజాపక్షం/అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామ పంచాయితీ కార్యదర్శిగా పని చేస్తూ బదిలీపై వెళ్తున్న ప్రవీణ్ కుమార్‌ని సోమవారం గ్రామ పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ మర్రి సంధ్య ఘనంగా సన్మానించారు. గ్రామ పంచాయితీకి ప్రవీణ్ చేసిన సేవలు అమూల్యమైనవని, నిబంధనలకు లోబడి తన కర్తవ్యాన్ని నిర్వర్తించారని గ్రామ పంచాయితీ అభివృద్ధిలో తన వంతు కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి కార్యదర్శి సంధ్య, మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్, గ్రామ పంచాయితీ సిబ్బంది, పాల్గొన్నారు.

స్మశానవాటికకు మరమ్మతులు

ప్రజాపక్షం/అశ్వాపురం: మొండికుం గ్రామ పంచాయితీలోని స్మశాన వాటికకు సోమవారం మరమ్మతులు చేపట్టడం జరిగింది. గత రెండు సంవత్సరాలుగా స్పెషల్ ఆఫీసర్ల పాలనలో ఎటువంటి మరమ్మతులు చేయకపోవడం వలన ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్న సమస్యలను గుర్తించి గత వారం రోజుల క్రితమే నీటి పైప్ లైన్ మరమత్తులు చేశారు. స్మశాన వాటికలో మట్టిని తోలించి స్మశాన వాటిక చుట్టు చేయించగా సర్పంచ్ మర్రి సంధ్య, ఉప సర్పంచ్ చలమల్ల శివకుమార్, కార్యదర్శి సంధ్య దగ్గర ఉండి పనులను పర్యవేక్షించారు.

వైభవంగా శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తల్లి కళ్యాణం

ప్రజాపక్షం/కూసుమంచి: మండల పరిధిలోని ధర్మతండా గ్రామ పంచాయితీలోని శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ తల్లి అమ్మవారి కళ్యాణం, బోనాల పండుగ సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవంలో గ్రామ ప్రజలు చుట్టు పక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి గోపయ్య స్వామి వారి కళ్యాణం వేద పండితులు అయిన స్వామినాథన్ ఆధ్వర్యంలో గ్రామ సరపచ్ జరుపుల కిరణ్మయి భద్రునాయక్ దంపతులు, ఉప సర్పంచ్ ఒడిత్య నాగేశ్వరరావు, భూమిక దంపతుల చేతుల మీదుగా నిర్వహించారు. అమ్మవారి కళ్యాణ పీటలపై జరుపుల వీరన్న స్వాతి దంపతులు, శివ రామకృష్ణ ఉమాదేవి దంపతులు, ఖమ్మంపాటి సోమయ్య, రాణి దంపతులు కూర్చొని అమ్మవారి కళ్యాణం జరిపించారు. కళ్యాణ అనంతరం మహా అన్నదాన కార్యక్రమం వడిత్య హనుమ(ఎంఈవో), గుగులోతు లక్ష్మణ్ కుటుంబ సభ్యులచే నిర్వహించారు. ఈకార్యక్రమంలో కూసుమంచి గ్రామ సర్పంచ్ కృష్ణవేణి, మహిపాల్ దంపతులు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జరుపుల వీరన్న, వడిత్య లచ్చిరాం, చెరుకుపల్లి వీరయ్య, జరుపుల పీక్య, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి

ప్రజాపక్షం/ములకలపల్లి: గ్రామ పంచాయితీ కార్మికుల పెండింగ్ జీతాలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సిఐటియు మండల కన్వీనర్ నిమ్మల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన తెలియజేసి, ఎంపీడీవో రామారావుకి వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయితీ కార్మికులు ప్రజలు వాడి పడేసిన మురికివ్యర్థాలను తొలగించడంలో కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని, కార్మికులకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. గ్రామ పంచాయితీ కార్మికులకు రక్షణ కిట్లు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయితీ కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. గ్రామ పంచాయితీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ గడ్డం వెంకటేశ్వర్లు, తెలంగాణ గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ మండల కోశాధికారి వర్క రుక్మధరావు, మండల నాయకులు వగ్గేల ధారయ, మేకల రమేష్, కనకం చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

సోలార్ లైట్లను మంజూరు చేయాలి

ప్రజాపక్షం/కారేపల్లి: సింగరేణి ప్రధాన కార్యాలయం కొత్తగూడెం నందు సింగరేణి డైరెక్టర్ ఇఏం తిరుమలరావును సోమవారం భాగ్యనగర్ తండా యువ నాయకులు గుగులోత్ హరు నాయక్ ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ప్రభావిత గ్రామమైన భాగ్యనగర్ తండా గ్రామంలో సింగరేణి సంస్థ ద్వారా సోలార్ లైట్లతో పాటు మౌలిక వసతులు కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈసందర్భంగా డైరెక్టర్ స్పందిస్తూ సోలార్ లైట్లు, మౌలిక వసతులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారని హరు తెలిపారు.

సర్వైకల్ క్యాన్సర్ టీకాపై అవగాహన సదస్సు

ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : స్త్రీలకు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్, ఇతర నాలుగు రకాల క్యాన్సర్ల నివారణకు రాబోయే తరానికి క్యాన్సర్ భారీ నుంచి కాపాడటం కోసం హెచ్‌పివి వ్యాక్సిన్ గొప్ప వరమని బనిగండ్లపాడు ప్రభుత్వ వైద్యశాల హెచ్ఇఓ భాస్కర్‌రావు తెలిపారు. సోమవారం శ్రీ భాస్కర్ మెమోరియల్ స్కూల్ నందు విద్యార్థులకు వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించారు. దాదాపు రూ.4వేలు పైగా ఖరీదు చేసే వ్యాక్సిన్ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఒక భారీ ప్రణాళికతో వీటిని చేపట్టిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ భట్ల పెనుమర్తి సూర్యనారాయణ, డైరెక్టర్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ శ్రీదేవి, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలకు హాజరు కావాలి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. పదవ తరగతి చదివే ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం శ్రీ భక్త రామదాసు కళాక్షేత్రంలో సోమవారం ఏర్పాటు చేసిన మోటివేషన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీవితంలో పదవ తరగతికి చాలా ప్రాముఖ్యత ఉందని విద్యార్థులు ఎటువంటి ఒత్తిడిలు లేకుండా పరీక్షలకు హాజరు కావాలన్నారు.మనం భయపడితే చదివింది కూడా మరిచిపోతామని పరీక్షలకు మరో రెండు వారాల గడువు ఉందని ఉన్న సమయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. మనం భయం లేకుండా పరీక్షలకు హాజరైతే మంచి ఫలితాలు వస్తాయన్నారు. విద్యార్థులు వీలైనంత వరకు గతేడాదిలో వచ్చిన ప్రశ్నాపత్రాలకు సొంతంగా పరీక్షలు రాసి పరీక్షించుకోవాలన్నారు. ఎన్ని ప్రాక్టీస్ టెస్టులు రాస్తే అంత మెరుగ్గా ఫైనల్ ఎగ్జామ్‌లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తారని తెలిపారు. ఒలంపిక్ క్రీడాకారులు ఎలాగైతే ప్రతి రోజు ప్రాక్టీస్ చేస్తారో అదేవిధంగా విద్యార్థులు కూడా ప్రాక్టీస్ చేయాలన్నారు. ఏ సబ్జెక్టులో వీక్‌గా ఉన్నామో తెలుసుకుని అధిగమించేందుకు ఆ సబ్జెక్టుకు కొంత అధిక సమయం కేటాయించాలన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు నిద్ర లేకుండా ఉండవద్దని ప్రతిరోజు కనీసం ఆరు నుంచి ఏడు గంటల నిద్ర ఉండాలన్నారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో బయట ఆహారం తీసుకోవద్దని, ఎక్కువగా తిరగవద్దని, మంచినీరు తగినంత త్రాగాలని కలెక్టర్ సూచించారు. అనంతరం మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదివే విద్యార్థులకు కలెక్టర్ పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారిణి చైతన్యజైని, మోటివేషన్ స్పీకర్ గంపా నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

భూదాన్ భూముల్లో రికార్డుల మాయాజాలం

-బిఆర్ఎస్ నేతలు

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : భూదాన్ భూముల్లో రికార్డుల మాయాజాలం స్పష్టమవుతుందని బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆరోపించారు. భూదాన్ భూముల్లోని పేదల గుడిసెలను తొలగించడం హేయమైన చర్య అన్నారు. సోమవారం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటరమణ మాట్లాడుతూ వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలో సాగుతున్న భూదాన్ భూముల అక్రమ దందాపై జిల్లా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. 1963లో దానంగా వచ్చిన భూముల రికార్డులను పరిశీలిస్తే అధికారుల రంగు బయటపడుతుందన్నారు. సర్వే నెం. 147, 148, 149 లో 31.20 ఎకరాల భూమిని కుర్రా నంద, తులస్య, దేశ్య, షేక్ మజీద్ సాబ్, గలాలు సాబ్, అక్బర్ సాబ్, దోమ అచ్చయ్య, రెంటుపల్లి సుబ్బయ్య, పల్నాటి చంద్రయ్య, రెడ్డెబోయిన వెంకటేశ్వర్లు వంటి నిరుపేదలకు కేటాయించారని వెంకటరమణ తెలిపారు. నేడు భూ భారతి డిజిటల్ పోర్టల్‌లో అసలైన లబ్దిదారుల పేర్లు మాయమైపోయాయని, 148 సర్వే నెంబర్‌లో ప్రైవేటు వ్యక్తుల పేర్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. వ్యవసాయ భూమి నాన్ అగ్రికల్చర్‌గా ఎలా మారిందన్నారు. 1963లో దానంగా ఇచ్చిన భూమికి నేటి భూమికి పొంతన లేదన్నారు. ఆర్డీవో ప్రోసిడింగ్స్ లేకుండా భూ బదాలాయింపు చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటారా అని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గత ప్రభుత్వంపై నేపం నెట్టి తప్పుకోవాలని చూస్తున్నారన్నారు. వెలుగుమట్ల భూదాన్ భూములపై తక్షణమే శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన అధికారులను సస్పెండ్ చేయాలన్నారు. వెలుగుమట్ల బాధితులకు బిఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బెల్లం వేణుగోపాల్, బాషబోయిన వీరన్న, పగడాల నరేందర్, లింగబోయిన సతీష్, బల్సు మురళీకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ చెన్నకేశవస్వామి కళ్యాణం

ప్రజాపక్షం/చింతకాని : చింతకాని శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయ ఆవరణలో సోమవారం రాత్రి శ్రీ భూనీలా సమేత శ్రీ చెన్నకేశవ స్వామి కల్యాణాన్ని వేదపండితులు శ్రీ శేషబట్టర్ రఘునాథా చార్యులు వారి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవంలో భాగంగా సుప్రభాతసేవ, ఆరాధన, సేవాకాలం, చతుస్థాన అర్చనలు, స్వస్తి పుణ్యావచనం, యాగశాల ప్రవేశం, నిత్య హోమం, బలిహరణం, పుర్ణాహుతి, స్వామివారి ఎదురుకోళ్ల ఉత్సవం అనంతరం స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించగా.. ఆలయ కమిటీ సభ్యులు మహా అన్నదాన కార్యక్ర మం నిర్వహించారు. అలాగే సీతంపేట గ్రామంలో శ్రీ గజగిరి లక్ష్మీ నర్సింహాస్వామి, కోమట్లగూడెం గ్రామంలో శ్రీశ్రీశ్రీ లక్ష్మీ అంకమ్మతల్లి కల్యాణ మహోత్సవాలను అర్చకులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి చుండూరు రామకోటేశ్వరరా వు, చెన్నకేశవ ఆలయ కమిటీ చైర్మన్ యండపల్లి శ్రీనివాసరావు, సర్పం చ్ కిలారు మనోహర్ బాబు, ఆలయ కమిటీ సభ్యులు కొమ్మిని రామారావు, బండి తిరపయ్య, తూము భిక్షం, వెంకటనారాయణ, పగిడిపల్లి నవత, రాంబాబు, ఆలయ అర్చకులు ఫణిహారం శ్రీనివాసాచార్యులు, గోపికృష్ణమాచార్యులు, ఆలయ సిబ్బంది నాగరాజు, బందెల నాగార్జున, గుండా రామయ్య, మాజీ ఎంపీపీ రత్నాకర్, మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, గ్రామస్థులు, జలగనబోయిన కృష్ణ , మల్లెల వెంకటేశ్వర్లు, పోట్ల నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

గుప్తనిధుల తవ్వకాల్లో తొమ్మిది మంది నిందితుల అరెస్ట్

జేసిబి, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ప్రజాపక్షం/పెనుబల్లిః ఫిబ్రవరి 25వ తేదీన సాయంత్రం బ్లూ కోర్టు సిబ్బంది పెట్రోలింగ్ చేస్తుండగా మండల పరిధిలోని ఏరుగట్ల గ్రామంలో ఓ పత్తి చేలో భూగర్భంలో దాగి ఉన్నట్లు భావించి బంగారు నిధులు (గుప్త నిధులు) ఉన్నాయని తవ్వకాలు ప్రారంభించారు. సమాచారం అందుకున్న విఎం. బంజర్ ఎస్సై కె. వెంకటేష్ పోలీస్ సిబ్బందితో దాడి చేయగా నిందితులు పరారయ్యారు. సంఘటనా స్థలంలో లభించిన ఒక జేసిబి, మూడు ద్వి చక్ర వాహనాలను స్వాధీనపరచుకున్నారు. సోమవారం వీయం. బంజర్ పోలీస్‌స్టేషన్‌లో సత్తుపల్లి రూరల్ సిఐ ముత్తులింగం, విఎం. బంజర్ ఎస్సై వెంకటేష్ విలేకర్లతో మాట్లాడుతూ గుప్త నిధుల సంఘటనలో కారకులైన తొమ్మిది మంది నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. వీరిలో చిక్కుమళ్ళ తిరుపతిరావు, కండే గోపాలరావు, భాషబోయిన రాజయ్య, వీరమళ్ళ రాధాకృష్ణ, కట్టేబోయిన మోహన్‌రావు, మర్రి గంగయ్య, గొర్రె పాటి నాగేశ్వరరావు, గంధసిరి మల్లయ్య, జక్కంపూడి రవి అను వారలను పోలీస్‌లు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించనున్నట్లు సీఐ తెలిపారు.

బంగారం చోరీ కేసులో దొంగ అరెస్ట్

ప్రజాపక్షం/పెనుబల్లిః ఫిబ్రవరి నెల 07వ తేదీన విఎం. బంజర్ సెంటర్లో ఆచారి జ్యూయలరీస్ షాప్ నుండి పట్ట పగలు చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఓ వ్యక్తిని అనుమానించారు. ఆదివారం విఎం. బంజర్ బస్టాండ్‌కు ఎదురుగా వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి పోలీస్‌లను చూసి, అనుమానంగా ప్రవర్తించడంతో పోలీస్‌లు అదుపులోకి తీసుకుని విచారించగా విఎం. బంజర్‌లోని బంగారు షాప్‌లో 36 గ్రాముల విలువైన 9 బంగారు ఉంగరాలు అపహరించినట్లు నిందితుడు అంగీకరించాడు. బంగారు ఉంగరాలను తిరువూరులోని లావణ్య కృష్ణ ఫైనాన్స్ వద్ద తనఖా పెట్టినట్లు నిందితుడు తెలిపాడు. వీటి విలువ సుమారు లక్షా ఇరవై వేలు ఖరీదు ఉంటుందని సీఐ ముత్తు లింగం, ఎస్సై వెంకటేష్ సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో తెలిపారు. తనఖా పెట్టిన బంగారాన్ని విఎం. బంజర్ పోలీస్‌లు స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సిఐ ముత్తు లింగం తెలిపారు.

సత్యనారాయణపురంలో సిసి రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాపక్షం/ ఎర్రుపాలెంః మండల పరిధిలోని గట్లగౌరవరం పంచాయతీ పరిధిలోని సత్యనారాయణపురంలో సోమవారం నూతన సిసి రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ బండ్ల రాణి ఆధ్వర్యంలో మధిర ఎఎంసి చైర్మన్ బండారు నర్సింహారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డిలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క కృషితో మంజూరైన ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.2.50లక్షలతో సిసి రోడ్డును నిర్మిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మారుమూల గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేసి గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పంబి లక్ష్మీ , బండ్ల ఆత్మప్రసాద్, మాజీ సర్పంచ్ పిట్టల శివయ్య, మన్నే కృష్ణారావు, పిట్టల నర్సింహారావు, పినపాక కృష్ణారావు, రామనబోయిన నారాయణ, రాంబాబు, మోదుగు వెంకటేశ్వర్లు, గ్రామ కార్యదర్శి నాగేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దుప్పి మాంసం పేరుతో ఆవు మాంసం విక్రయం

ప్రజాపక్షం/జూలూరుపాడుః జూలూరుపాడు మండల పరిధిలోని పాపకొల్లు శివారు అటవీ ప్రాంతంలో కొత్త దందాకు తెర తీస్తున్నారు కొందరు కేటుగాళ్లు. ఏజెన్సీ ప్రాంతం, వేసవికాలం కావడంతో కొందరు వ్యక్తులు వన్య ప్రాణులను వేటాడటానికి చూస్తూ ఉంటారు. పొలం పనుల కోసం ఉపయోగించే ఎద్దులను దొంగిలించడమే కాదు వాటిని చంపి జింక, దుప్పి మాంసమంటూ ప్రజలకు అమ్ముతున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. మండల పరిధిలోని పాపకొల్లు ప్రాంతం శివారు గ్రామాలకు చెందిన ఓ ఆవు (ఎద్దు) అడవికి మేతకు వెళ్ళింది. గుర్తుతెలియని వ్యక్తులు చంపి మాంసాన్ని తీశారు. అడవి జంతువు మాంసం అని అమ్మకాలు జరిపారు. మేతకు వెళ్లిన మూగజీవం తిరిగి ఇంటికి రాకపోవటంతో రైతు అడవిలో వెతికాడు. ఎద్దు (కలేబరం) మృతదేహం కనిపించడంతో తల్లడిల్లాడు. ఈ సంఘటన ఆ ప్రాంతంలో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అటవీ జంతువులు వేటాడం సాధ్యం కానప్పుడు ఆవు, ఎద్దు, నాటు పందులు, కుక్కలు లాంటి వాటిని చంపి జింక, దుప్పి మాంసంగా పేర్కొని ఈ ముఠా అమ్ముకునేవారని గ్రామాల్లో జోరుగా చర్చ జరుగుతుంది.ఇ లా ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు. సోషల్ మీడియాలో వైరల్ గా మారిన ఈ విషయంలో వాస్తవం ఏంటనేది తేలాల్సి ఉంది.

వైరా బస్టాండ్‌లో మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

ప్రజాపక్షం/వైరాః వైరా బస్టాండ్‌లో వర్తక సంఘం అధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం ఆర్యవైశ్య మహాసభ, వాసవి డైమండ్ క్లబ్, వాసవి వనిత క్లబ్ వైరా వారి ఆధ్వర్యంలో సోమవారం మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ , మంచినీళ్ల ప్యాకెట్లను ప్రయాణీకులకు అందించారు. ఈ సందర్భంగా వనమా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఎండ తీవ్రత, బస్టాండ్‌లో ప్రయాణీకుల సౌకర్యార్థం ఈ పంపిణీ కార్యక్రమం చేయడం జరిగిందని, భవిష్యత్తులో కూడా మరెన్నో కార్యక్రమాలో ఈ క్లబ్‌ల ద్వారా చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన వారిలో వాసవి డైమండ్ క్లబ్ అధ్యక్షులు నంబూరు శ్రీనివాసరావు, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు మిట్టపల్లి మహాలక్ష్మి , డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూర్తి, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కొణతాలపల్లి వెంకటసుబ్బారావు, వనమా మల్లికార్జునరావు, రాయల లలితకుమారి, గ్రంధి మంగమ్మ, గ్రంధి సత్యవాణి, వనమా వెంకటేష్, నూకల వాసు, మిట్టపల్లి కిరణ్‌కుమార్, వజినేపల్లి చక్రవర్తి, వజినేపల్లి రవి, నూకల ప్రసాద్, కొల్లా రాంబాబు, రంగా సింహాద్రి, రాయల అన్నపూర్ణ, సుగ్గల మాధవి, మిట్టపల్లి సుధా, వనమా రూపా, రాయల విజయలక్ష్మి , మౌనిక పాల్గొన్నారు.

యుద్ధాన్ని ఖండించండి

ప్రజాపక్షం/కారేపల్లి: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ ఫాసిస్టు యుద్ధాన్ని ఖండించాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కారుపల్లి కామేపల్లి సంయుక్త మండల కార్యదర్శి భూక్య శివ నాయక్ అన్నారు. కారేపల్లి మండల కేంద్రంలో గల హెడ్ కోటర్ నుండి ప్రకటన విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు రోజులుగా ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ సంయుక్తంగా ఫైటర్ జట్లతో క్షిపణుల వర్షం ఎడతెరిపి లేకుండా కురిపిస్తుందని, ఈ లక్షదాడులతో ఇరాన్ అధినేతకు మేనిలో పాపు రక్షణ మంత్రి సైన్య అధిపతి తదితరులు మరణించారని, ఈ దాడులు అతి అత్యంత దుర్మార్గమైన ఫాసిస్టు దాడులుగా భావిస్తూ తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ యుద్ధ నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇజ్రాయిల్ పర్యటనలోనూ వారి ఆలింగాణ అమానుష యుద్ధాన్ని ఖండించాల్సిన ఉంటుందని, శాంతికి నముడు కట్టవలసి ఉంటుందని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భావిస్తుందని ధ్వజం ఎత్తారు.